RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 46 | గురువారం, మార్చి 14, 2024 | పేజీలు : 4

## జూబ్లీహిల్స్ స్థానిక మహిళ కార్పొరేటర్‌పై దాడి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరోసారి ఫ్లెక్సీల వివాదం చెలరేగింది. ఈ ఘటనలో స్థానిక మహిళ కార్పొరేటర్‌పై దాడి జరిగింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ దేదీప్య రావుపై స్థానిక మహిళలు దాడి చేశారు. దీంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. తన భర్త విజయ ముదిరాజ్‌తో కలిసి దేదీప్య రావు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా మాగంటి గోపీనాథ్ అరాచకాలు ఎక్కువ అయిపోయాయంటూ స్థానిక మహిళలు ఆరోపించారు. కాగా, కార్పొరేటర్ దేదీప్య రావుపై స్థానిక మహిళలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తాం: మంత్రి తుమ్మల

వైరా మార్చి 13: ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రంలో వైరా రిజర్వాయర్ ను సీతారామ ప్రాజెక్టు కెనాల్ ద్వారా సాగునీరు అందించేందుకు అనుసంధానం సీతారామ ప్రాజెక్టు కాలువకు 100 కోట్లు నిధులు మంజూరు చేశారు. వైరా రిజర్వాయర్ ఆనకట్ట వద్ద



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తుమ్మల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన అన్నారు . వైరా రిజర్వాయర్ను బ్యాలెన్స్ రిజర్వాయర్ గా మార్చేందుకు సీతారామ ప్రాజెక్టు కెనాల్ ను అనుసంధానం చేస్తామనీ అన్నారు . అనుసంధానం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి 100 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించారని అన్నారు. సీతారామ ప్రాజెక్టు అనుసంధానంతో వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు సాగునీరు ,త్రాగునీరు అందిస్తామని ఆయన అన్నారు. సీతారామ ప్రాజెక్టు కెనాల్ పనులను వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 లోపే సీతారామ ప్రాజెక్టు నీళ్లను వైరా రిజర్వాయర్ లోకి అనుసంధానం చేస్తామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్ నీరు అందించటం తన చిరకాల కోరిక అని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమ మే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ , సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ , బొర్ర రాజశేఖర్ , కట్ల రంగారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట నర్సిరెడ్డి, దాసరి దానియేలు, కట్ల సంతోష్, పొదిలి హరినాథ్, ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## 72 మంది అభ్యర్థులతో బీజేపీ రెండో జాబితా విడుదల

**న్యూఢిల్లీ మార్చి, 13 :** లోక్‌సభ ఎన్నికలకు 72 మంది అభ్యర్థులతో బీజేపీ రెండో జాబితాను బుధవారం ప్రకటించింది. రెండో జాబితాలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, హరియాణా మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్‌లకు చోటు దక్కింది. ఇక లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ ఇప్పటికే విడుదల చేసింది. ఇందులో మొత్తం 195 సీట్లకు అభ్యర్థులను ప్రకటించారు. వారణాసి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ బరిలో దిగనుండగా తొలి జాబితాలో 34 మంది మంత్రులు, స్పీకర్, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఉన్నారు. మొదటి జాబితాలో 28 మంది మహిళలకు టికెట్లు ఇచ్చారు. షెడ్యూల్ కులాల నుంచి 27, గిరిజనుల నుంచి 18, ఓబీసీల నుంచి 57 మందికి టికెట్లు ఇచ్చారు.



## బీజేపీ రెండోలిస్ట్ విడుదల

### తెలంగాణ నుంచి ఆరుగురి పేర్లు..

**హైదరాబాద్ మార్చి, 13 :** లోక్‌సభ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ బుధవారం రెండో విడత అభ్యర్థులను ప్రకటించింది. ఈ నెల ప్రారంభంలో 195 మందితో తొలి జాబితాను విడుదల చేసింది. తెలంగాణ నుంచి తొమ్మిది మంది అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. తాజాగా 72 మంది అభ్యర్థులతో రెండో జాబితాను విడుదల చేయగా.. ఇందులో తెలంగాణ నుంచి ఆరుగురికి చోటు దక్కింది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి గోడెం నగేశ్, పెద్దపల్లి గోమాస శ్రీనివాస్, మెదక్ ఎం రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్ డీకే అరుణ, నల్గొండ సైదిరెడ్డి, మహబూబాబాద్ అజ్మీరా సీతారాం నాయక్ అభ్యర్థులుగా ప్రకటించింది. తెలంగాణలో ఇప్పటికే 9 మంది అభ్యర్థులను ప్రకటించగా.. నిజామాబాద్ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్, కరీంనగర్ బండి సంజయ్, భువనగిరి నుంచి బూర నర్సయ్య గౌడ్, మల్కాజిగిరి ఈటల రాజేందర్, సికింద్రాబాద్ కిషన్ రెడ్డి, హైదరాబాద్ నుంచి మాధవి లతను అభ్యర్థులుగా బరిలో దింపింది. తెలంగాణలో 17 స్థానాలుండగా ఇప్పటి వరకు 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వరంగల్, ఖమ్మం స్థానాల అభ్యర్థుల పేర్లు పెండింగ్‌లో పెట్టింది.

## బలపరీక్షలో నెగ్గిన... హర్యానా కొత్త సీఎం



చండీఘడ్: హర్యానా సీఎం నాయాబ్ సింగ్ సైనీ.. రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో నెగ్గారు. మూజువాణీ ఓటు ద్వారా విశ్వాస తీర్మానాన్ని ఆమోదించారు. మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామాతో.. అనూహ్య రీతిలో సైనీ సీఎం బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఇవాళ ప్రత్యేకంగా సమావేశమైన అసెంబ్లీలో ఆయన బలపరీక్ష ఎదుర్కొన్నారు. జేజేపీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఇవాళ అసెంబ్లీ పరిసరాల్లో కనిపించారు. పార్టీ ఇచ్చిన విప్‌ను ఉల్లంఘించి కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీ చేరుకున్నారు. అయితే విశ్వాస పరీక్ష మొదలైన తర్వాత ఆ ఎమ్మెల్యేలు హౌజ్ నుంచి వెళ్లిపోయారు. ప్రతిపక్ష నేత భూపిందర్ హుడా, కాంగ్రెస్ ఎమ్మెల్యే బీబీ బద్రాలు సభను గంట పాటు వాయిదా వేయాలని కోరారు. రాష్ట్రంలో అస్థిరత్వం ఉందని, రాష్ట్రపతి పాలన విధించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే రఘువీర్ కడియన్ తెలిపారు. విశ్వాస పరీక్షపై సీక్రెట్ బ్యాలెట్ కావాలని ఆయన డిమాండ్ చేశారు.

## మహారాష్ట్ర సిఎం షిండే నేమ్‌ప్లేట్‌లో చేరిన తల్లిపేరు




ముంబై: ఈ ఏడాది మే1 న లేదా తరువాత పుట్టినవారి పేర్లలో తల్లి పేరు తప్పనిసరిగా చేర్చాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చారిత్రక నిర్ణయం తీసుకుంది. ఆధార్, పాన్ కార్డులతోపాటు ప్రభుత్వ రికార్డుల్లో కూడా ఈ విధంగా తల్లిపేరు చేర్చవలసి ఉంటుంది. ఈ నిర్ణయం మేరకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే . సౌత్ ముంబై లోని రాష్ట్ర సెక్రటేరియట్‌లో తన కార్యాలయం బయట నేమ్‌బోర్డులో మార్పులు చేశారు. తన తండ్రి పేరుకు ముందు తల్లిపేరు చేర్చారు. ఇప్పుడీ కొత్త నేమ్‌ప్లేట్‌లో 'ఏక్‌నాథ్ గంగూబాయి శంభాజీ షిండే ' అని పేరు పెట్టారు. రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రి అదితి తాత్కరే మొదట తీసుకొచ్చిన ఈ ప్రతిపాదనను క్యాబినెట్ ఆమోదించిందని, దీనికి అనుగుణంగానే ముఖ్యమంత్రి స్వయంగా తానే తన పేరులోతల్లిపేరు ముందుగా చేర్చి ఆదర్శవంతులయ్యారని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. డిప్యూటీ సిఎం , సీనియర్ బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్, మరో డిప్యూటీ సిఎం అజిత్ పవార్, కూడా తమ నేమ్‌ప్లేట్‌ల్లో తల్లిపేరును చేర్చారు. ఫడ్నవీస్ నేమ్ ప్లేట్‌లో దేవేంద్ర సరితా గంగాధరరావు ఫడ్నవీస్ అని మారగా, అజిత్ పవార్ నేమ్‌ప్లేట్‌లో అజిత్ అక్షతాయి అనంతరావు పవర్ అనే పేరు పెట్టుకున్నారు.

## హను-మాన్ టీమ్‌పై ప్రశంసలు కురిపించిన అమిత్ షా

**హైదరాబాద్ మార్చి, 13 :** క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఒరిజినల్ ఇండియన్ సూపర్ హీరో చిత్రం 'హను-మాన్', తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. రీసెంట్‌గా 50 రోజుల రన్‌ను పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ వేడుకను ఘనంగా జరుపుకుంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాత కె నిరంజన్ రెడ్డికి, అన్ని ఏరియాల్లో బయ్యర్‌లకు భారీ లాభాలను తెచ్చిపెట్టింది. కమర్షియల్ హిట్ అయిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.



భారతదేశం యొక్క ఆధ్యాత్మిక సంప్రదాయాలను, వాటి నుంచి ఉద్భవించిన సూపర్‌హీరోలను అద్భుతంగా చూపించడంలో విజయం సాధించిన 'హను-మాన్' టీంపై తాజాగా ప్రశంసలు కురిపించారు కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా. వారి భవిష్యత్ ప్రాజెక్ట్‌ల కోసం యూనిట్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సమావేశానికి హాజరయ్యేందుకు హోంమంత్రి హైదరాబాద్‌కు వచ్చిన నేపథ్యంలో దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జా, నిర్మాత కె.నిరంజన్ రెడ్డి హైదరాబాద్‌లో అమిత్ షాను కలిశారు. హను-మాన్ బృందం అమిత్ షాకు హనుమంతుడి షీల్డ్‌ను బహుకరించింది. అమిత్ షా ఈ సమావేశానికి సంబధించిన ఫోటోలు పంచుకున్నారు.''ఇటీవలి సూపర్‌హిట్ చిత్రం హనుమాన్ లోని ప్రతిభావంతులైన నటుడు శ్రీ తేజాసజ్జా, చిత్ర దర్శకుడు శ్రీ ప్రశాంత్ వర్మను కలవడం జరిగింది. భారతదేశం యొక్క ఆధ్యాత్మిక సంప్రదాయాలను, వాటి నుండి ఉద్భవించిన సూపర్ హీరోలను చిత్ర యూనిట్ అద్భుతంగా చూపించింది. హనుమాన్ టీమ్‌కి వారి భవిష్యత్ ప్రాజెక్ట్‌లకు శుభాకాంక్షలు"అని రాశారు అమిత్ షా. ఈ ఫోటోలో మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కూడా చూడవచ్చు. అమిత్ షా ప్రశంసలకు హను-మాన్ టీమ్ చాలా థ్రిల్ అయ్యింది.

దర్శకుడు ప్రశాంత్ వర్మ ఆనందం వ్యక్తం చేస్తూ, "మిమ్మల్ని కలవడం ఒక గొప్ప అదృష్టం సార్ మీ మంచి మాటలు, ప్రోత్సాహం మాకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చాయి" అన్నారు హీరో తేజ సజ్జా ఆనందం వ్యక్తం చేస్తూ "అమిత్‌షా సార్‌ని కలవడం మాకు గర్వకారణం. మీ మంచి మాటలకు ధన్యవాదాలు సార్ " అని రాశారు. ఈ సినిమా త్వరలో ఓటీటీ విడుదల కానుంది. మరోవైపు, ప్రశాంత్ వర్మ హను-మాన్ సీక్వెల్ 'జై హనుమాన్' ప్రీ-ప్రొడక్షన్‌లో నిమగ్నమై వున్నారు.

## మహిళలకు 50%... ప్రభుత్వ ఉద్యోగ కోటా

### బీజేపీని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ ఎత్తులు



ధూలె (మహారాష్ట్ర) : రానున్న లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లయితే ఐదు 'మహిళా న్యాయ్' గ్యారంటీలు ఇస్తామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ బుధవారం ప్రకటించారు. ఆ గ్యారంటీలలో భాగంగా నిరుపేద మహిళలకు ఏటా లక్ష రూపాయలు ఇస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలలో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని రాహుల్ వాగ్దానం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పక్షంలో రిజర్వేషన్‌పై 50 శాతం పరిమితి రద్దుకు రాజ్యాంగ సవరణ తీసుకువస్తుందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కమ్యూనికేషన్ల ఇన్‌చార్జి జైరామ్ రమేష్ హామీ ఇచ్చారు. తన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా ధూలె జిల్లాలో మహిళా ర్యాలీలో ప్రసంగించిన రాహుల్ గాంధీ ఐదు 'మహిళా న్యాయ్' గ్యారంటీలు ప్రకటించారు.

నిరుపేద మహిళల బ్యాంకు ఖాతాల్లో ఏటా లక్ష రూపాయలు డిపాజిట్ చేయనున్నట్లు, తమ పార్టీ ప్రభుత్వ ఉద్యోగాలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఆశా (అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ ఏక్టివిస్ట్) కార్మికులు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకాలలో పని చేసే మహిళలకు సంబంధించిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ వాటాను రెట్టింపు చేయనున్నట్లు రాహుల్ వాగ్దానం చేశారు. మహిళల హక్కుల గురించి వారికి బోధపరిచేందుకు, కేసులపై పోరులో సాయం చేసేందుకు నోడల్ అధికారి ఒకరిని నియమించనున్నట్లు ఆయన తెలిపారు. తన ఐదు గ్యారంటీలను వివరించిన రాహుల్ గాంధీ దేశంలోని ప్రతి జిల్లాలో మహిళల కోసం సావిత్రిబాయ్ ఫూలె హాస్టళ్లు ఏర్పాటు చేయగలమని తెలియజేశారు.

అన్యాయం కారణంగా దౌర్జన్యకాండ, విద్వేషం ఎదుర్కొంటున్నామని రైతులు, యువజనులు, మహిళలు తనతో చెప్పిన తరువాత మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు తన రెండవ దశ యాత్రలో 'న్యాయ్' పదం చేర్చినట్లు రాహుల్ వివరించారు.

## నాలుగు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్




**హైదరాబాద్ మార్చి, 13 :** వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మరో నాలుగు లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్యను, చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్లను ప్రకటించారు. జహీరాబాద్ పార్లమెంటు స్థానానికి గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్ పార్లమెంటు స్థానానికి బాజిరెడ్డి గోవర్దన్‌ను నిర్ణయించారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో చర్చించి వారి అభిప్రాయాలకు అనుగుణంగా కేసీఆర్ అభ్యర్థులను ఎంపిక చేశారు. కాగా ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ఐదు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్ (ఎస్టీ రిజర్వ్) స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత, కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి (ఎస్సీ రిజర్వ్) స్థానం నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను తొలి జాబితాలో ఖరారు చేశారు. అనంతరం మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా మన్నెం శ్రీనివాస్‌రెడ్డిని ప్రకటించారు.

## సంపాదకీయం

# చీకటిలో వికసించిన జ్ఞానపద్మం....!

ఈ సంవత్సరం జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన జగద్గురు రామభద్రాచార్య రెండు నెలల వయస్సులోనే ట్రకోమా వ్యాధితో కంటిచూపు కోల్పోయారు. అయినా ఇరవై రెండు భాషలు నేర్చుకొని సుమారు రెండు వందల పుస్తకాలను రచించడమే కాకుండా ప్రపంచంలోనే తొలిసారిగా దివ్యాంగుల కోసమే ఉచిత చదువు, వసతీ సౌకర్యాలతో ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేసే స్థాయికి చేరుకున్నారు. 14 జనవరి 1950లో ఉత్తర ప్రదేశ్‌లోని జౌన్‌పూర్ జిల్లాలో శాండీకుర్ద్ గ్రామంలో జన్మించిన రామభద్రాచార్య అసలు పేరు గిరిధర్ లాల్ మిశ్రా. 1953 జూన్ నెలలో గ్రామంలో గారడీవాడి కోతి నృత్యం చేస్తున్న ప్రదర్శనలో కోతి వీక్షకులను తాకే సమయంలో గిరిధర్ లాల్ పిల్లలతో సహా పారిపోబోతూ ప్రమాదవశాత్తూ ఒక పాడుబడిన నూతిలో పడిపోయారు. ఒక యువతి రక్షించేవరకు అక్కడే చిక్కుకు న్నాడు. తులసీదాస్ రామచరిత మానస్‌లోని 'యహ చరిత్ జే గావహి హరిపద్ పావైతే న పరహి బవకృప' అన్న శ్లోకంలోని పంక్తిని నేర్చుకున్నందున అతని జీవితం రక్షింప బడిందని అతని తాత చెప్పే వారు (దీనిని పాడేవారు హరి పాదాలకు చేరుకుంటారు. జనన మరణాల ఊబిలో పడరు). గిరిధర్‌లాల్‌కు ప్రారంభ విద్య అతని తాతగారి నుంచి లభించింది. రామాయణ, మహాభారతంలోని కథలను విశ్రామ్ సాగర్, సుఖ్‌సాగర్, ప్రేమ్ సాగర్, బ్రజ్విలాస్ లాంటి భక్తి రచనలను తాతయ్య అతనికి చెప్పేవారు. అయిదేళ్ల వయసులోనే గిరిధర్ తన మొదటి కవితా భాగాన్ని అవధి (హిందీ మాండ లికం)లో కూర్పు చేశాడు. ఊరిలో అయిదవ తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత సంస్కృత వ్యాకరణం, హిందీ, ఇంగ్లీష్, భూగోళ శాస్త్రం, గణితం, చరిత్ర అధ్యయనం చేశారు. సంస్కృత విద్యలో ప్రథమ, పూర్వ మాధ్యమ, ఉత్తర మాధ్యమ, శాస్త్రి, ఆచార్య పరీక్షలలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. “మీ ఉపాధ్యాయులు ఎవరెవరో మీకు తెలుసా?' అని చిత్రకూట్‌లో నేను ఐజీపీగా ఉన్నప్పుడు మా ఇంటికి విచ్చేసిన రామభద్రాచార్య గారిని అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పారు: “నా ధ్యానం అంతా ఉపాధ్యాయుడు చెప్పే పాఠం మీదే ఉండేది. నేను విని అర్థం చేసుకునేవాడిని. ఇంటికి వచ్చి మా తమ్ముడికి చెప్పేవాడిని. వాడు ఒక పుస్తకం మీద రాసేవాడు. తిరిగి చదవి వినిపించేవాడు. అలా నాలో జ్ఞాపక శక్తి, సృజనాత్మకత పెరిగింది.” ఈశ్వరదాస్ (మంత్రం), రామప్రసాద్ త్రిపాఠి (సంస్కృతం), రామచరణదాస్ (సంప్రదాయం)లను తన గురువులుగా చెప్పే రామభద్రాచార్య – బెనారస్‌లోని సంపూర్నానంద సంస్కృత విద్యాలయంలో టాపర్‌గా నిలిచి స్వర్ణపతకం పొందారు. 1976లో నవ్య వ్యాకరణాచార్య పరీక్షలో విశ్వవిద్యాలయంలో ప్రథమ స్థానం పొందారు. 1981లో 'ఆధ్యాత్మ రామాయనే అపాణినీయ ప్రయోగాణా విమర్శ' విషయం మీద పీహెచ్డీ పొందారు. 1996లో 'అష్టాధ్యాయః ప్రతిసూత్రం శాబ్దబోధ్ సమీక్షణం' విషయం మీద డీలిట్ పొందారు. ఈ పరిశోధన సంస్కృతంలో 1975 పేజీల్లో రాశారు. దీనిని ప్రపంచంలోనే అతి విస్తృత సంస్కృత పరిశోధనగా చెబుతారు. పాణిని వ్యాకరణం మీద పదివేల పేజీల వ్యాఖ్యానం రాశారు. సంస్కృత వ్యాకరణంలో అసాధారణ పాండిత్యం సంపాదించారు. 'వేదాంత, న్యాయ'లలో ప్రావీణ్యం పొందారు. వీరిది విశిష్టాద్వైత వేదాంతం, రామాయణ, భాగవత కథకులుగా ఉత్తర భారతంలో చాలా ఖ్యాతి గడించారు. వీరు వ్యాకరణం, సాంఖ్య, న్యాయ, వేదాంత, సంస్కృత అంతక్షారి విభాగాలలో బంగారు పతకాలను సాధించారు. అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ ఐదు బంగారు పతకాలతోపాటు, ఉత్తరప్రదేశ్ తరపున చల్వాయిజయంతి ట్రోఫీని గిరిధర్‌కు అందజేశారు. అతని ప్రతిభకు మెచ్చి ఇందిరాగాంధీ వీరి కళ్ళకు చికిత్స కోసం ప్రభుత్వ ఖర్చుతో అమెరికాకు పంపాలని ప్రతిపాదించారు. కాని గిరిధర్ ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. 'దుర్గుణాలతో నిండిన, వివాదాలతో, మోనపూరితమైన దుష్టమానవుల పాపాలతో పరిపాలించబడుతున్న ఈ ప్రపంచంలో నేనేమి చూడాలి? కమలం లాంటి ముఖాన్ని కప్పివేసే వెంట్రుకలు కలిగిన, సంపూర్ణ ఆనందంలో ఉన్న, పిల్లల రూపాన్ని కలిగివున్న రాముడు మాత్రమే విముక్తి ఇచ్చేవాడు' అని ప్రధాన ఇందిరా గాంధీకి జవాబు రాసి పంపారు శ్రీ రామభద్రాచార్య. వీరు 8 సంస్కృత మహాకావ్యాలు రాశారు. సుమారు 100 సంస్కృత స్తోత్ర కావ్యాలు రాశారు. 11 ఉపనిషత్తుల మీద 11 తాత్విక గ్రంథాలు రాశారు. శ్రీమద్భగవద్గీత, బ్రహ్మసూత్ర, శ్రీరామస్తవరాజ, శ్రీనారదభక్తి సూత్ర గ్రంథాల మీద 'శ్రీ రాఘవకృపా భాష్యం' రాశారు. 16 లఘు కావ్యాలు రాశారు. ప్రవచన గ్రంథాలు, టీకా గ్రంథాలు, సంపాదకీయ గ్రంథాలు రాశారు. వీరి రచనలలో 'ప్రస్థానత్రయి, శ్రీ భార్గవ రాఘవీయం, బృంగదూతం, గీతారామాయణం, శ్రీసీతారామ సుప్రభాతం, శ్రీసీతారామ కేళీ కౌముది, అష్టావక్రుడు, శ్రీ రాఘవకృపా భాష్యం' ప్రముఖమైనవి. రామభద్రాచార్య తులసీదాసు పేరు మీద చిత్రకూట్‌లో సామాజిక సేవా సంస్థ 'తులసీ పీఠ్'ను స్థాపించారు. తనలాంటి దివ్యాంగుల కోసం చిత్రకూట్‌లో విద్యాలయాలు స్థాపించారు.

# ఉద్దమర్రిలో ఘనంగా కుమ్మర మొల్లమాంబ జయంతి వేడుకలు




**శామీర్ పేట, (గరుడ వార్త):** కుమ్మర మొల్లమాంబ జయంతి వేడుకలు కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడు చింతలపల్లి మండల ఉద్దమర్రి గ్రామంలో కుమ్మర సంఘం భవనం వద్ద బుధవారం శాలివాహన (కుమ్మర) సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుమ్మర మొల్లమాంబ 584 వ జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి శామీర్ పేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విలసాగరం సుదర్శన్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ యూత్ జనరల్ సెక్రటరీ కలికోట బాలరాజ్ పాల్గొని కుమ్మర మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను చదువుతో పనిలేదని పక్కన పెట్టిన రోజుల్లో తన కలంతో అందరికీ సమాధానం చెప్పి రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి తెలుగు కవయిత్రి అని పేర్కొన్నారు. ఆమె ఆనాడు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఉద్దమర్రి కుమ్మర సంఘానికి తనకు తోచిన సహాయ సహకారాలు అందిస్తానని సుదర్శన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మండల బీసీ సెల్ అధ్యక్షుడు నెల్లుట్ల యాదగిరి, కుమ్మర సంఘం అధ్యక్షుడు నెల్లూట్ల వెంకటేష్, యువజన కుమ్మర సంఘం అధ్యక్షులు నెల్లుట్ల రామాంజనేయులు, మాజీ అధ్యక్షులు నెల్లుట్ల కరుణాకర్, సంఘం సభ్యులు నెల్లూట్ల శ్రీకాంత్, బాల్ రాజ్, భాస్కర్, కరుణాకర్, శివశంకర్, యాదయ్య, భాగయ్య, బాలయ్య, మల్లేష్, ఆంజనేయులు, శ్రీరాములు, రవీందర్, సదానందం, ప్రవీణ్, కిరణ్, సిమెంట్ ఆంజనేయులు, ఉపేందర్, రామాంజనేయులు, మూడు చింతల పల్లి మండల కుమ్మర సంఘం మాజీ అధ్యక్షులు బల్ రామ్, భాస్కర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలి: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం



**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త):** రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్దంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని విసి హాల్ లో జరిగిన ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధత పై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్దంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకుగాను ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ లో భాగమైన అన్ని విభాగాల నోడల్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండి ఎలాంటి లోపాలు తలెత్తకుండా తమ ఎన్నికల విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది డాటా నమోదు పూర్తి చేయాలన్నారు. అన్ని విభాగాల వారికి శిక్షణ పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు కావాల్సిన సామాగ్రి సేకరణ పూర్తి చేయాలన్నారు. పోలీసు బందోబస్తు పకడ్బందీగా చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాల ఏర్పాటు ఉండాలని, పోలింగ్ కేంద్రం బయట ఎన్ని పోలింగ్ కేంద్రాలకు సిసి కెమెరాలు ఎలా ఏర్పాటు చేయాలో కార్యాచరణ చేయాలన్నారు. ఇవిఎం లు, ఎన్నికల సిబ్బంది రవాణాకు పటిష్ట ప్రణాళిక చేయాలన్నారు. వాహనాలకు జిపిఎస్ సిస్టం అమర్చి, వాటిని ట్రాక్ చేయాలన్నారు. స్వీప్ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. ఎన్నికల ఖర్చు నియంత్రణ పై పర్యవేక్షణ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్టి, వివిటిల ఏర్పాటుచేసి, శిక్షణ ఇవ్వాలన్నారు. క్లిష్టమైన పోలింగ్ బూతుల జాబితాను తయారు చేసి పోలీస్ బందోబస్తు పటిష్ఠపరచాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్ వోటింగ్ కు గాను ఫారం 12 –డి ని ముందుగానే అవసరమైన ఓటర్లకు అందజేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసిఎంసి కమిటీ ద్వారా పెయిడ్ న్యూస్, ప్రకటనల ఖర్చును వ్యయ నియంత్రణ కమిటీకి ఎప్పటికప్పుడు పంపాలని, ప్రెస్ మీట్స్ నిర్వహణ, సమాచార లోపం లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, నోడల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## యాదాద్రి వివాదంపై...

# స్పందించిన భట్టి విక్రమార్క



హైదరాబాద్: యాదగిరిగుట్టలో కింద కూర్చున్నారంటూ జరిగిన ట్రోల్ అంశంపై తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. తాను కావాలనే చిన్న స్టూల్ మీద కూర్చున్నాను అని భట్టి తేల్చి చెప్పారు. ఆ ఫోటోను తీసుకొని కావాలని కొందరు ట్రోల్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థికశాఖామంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని శాసిస్తున్నానన్నారు భట్టీ విక్రమార్క. ఎవరికీ తలవంచే వాడిని కాదని%ా% ఎవరో పక్కన కూర్చోబెడితే కూర్చునే వాడిని అసలికే కాదన్నారు. ఆత్మ గౌరవాన్ని చంపుకునే మనస్తత్వం తనది కాదంటూ యాదాద్రి వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టేశారు భట్టీ. యాదాద్రి దేవాలయంలో పూజల సందర్భంగా భట్టీ చిన్న పీటపై కూర్చోవడం విమర్శలకు దారి తీసింది. సీఎం దంపతులు, పలువురు మంత్రులు ఎత్తున్న సీట్లపై కూర్చోవడం%ా% భట్టీ మాత్రం కాస్త ఎత్తు తక్కువ పీటపై కూర్చోవడంతో తీవ్ర దుమారం రేగింది. యాదాద్రీశుడి సాక్షిగా దళిత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘోర అవమానం జరిగిందని బీఆర్ఎస్, బీఎస్పీ విమర్శించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదాద్రి పర్యటనలో దళితుడు అనే కారణంతో భట్టిని కింద కూర్చోబెట్టారని పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేశారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్రంగా ట్రోల్ జరగడంతో... భట్టీ విక్రమార్క క్లారిటీ ఇచ్చారు. తనకు ఎలాంటి అవమానం జరగలేదని, కావాలనే తాను చిన్న పీటపై కూర్చున్నానని వివరణ ఇచ్చారు.

# బీసీ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షనీయం




**శామీర్ పేట, (గరుడ వార్త) :** బీసీ కార్పొరేషన్ ఏర్పాటుతో బీసీలకు లబ్ధి చెందబోతుందని వి కేర్ ఫోర్ యు ట్రస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, బిజెపి మేడ్చల్ జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ మంచినీళ్ల లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ఏర్పటుపై ఆనందం వ్యక్తం చేస్తూ తెలంగాణా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, మంత్రి వర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన సిఐ శ్రీనాథ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**శామీర్ పేట (గరుడ వార్త):** ఇటీవల బదిలీపై వచ్చి శామీర్ పేట పోలీస్ స్టేషన్లో పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ నీ శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆలియబద్ గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు నెమురి. విష్ణువర్ధన్ గౌడ్ లు బుదవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు పరిశీలించిన ఎస్ఈ



**శామీర్ పేట, (గరుడ వార్త) :** ఉమ్మడి శామీర్ పేట మండలంలో విద్యుత్ ఎస్ఈ శ్రీరామ్మోహన్ 24 గంటల విద్యుత్ అందుతుందో లేదోనని పరిశీలించారు. బుధవారం మూడు చింతలపల్లి మండలం లింగాపూర్ తండా, కేశవరం, శామీర్ పేట పరిధిలో వ్యవసాయ పొలాలను ఆయన పరిశీలించారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తెలుసుకోవడానికి విద్యుత్ ఉన్నతాధికారులు నేరుగా రైతు పొలాలను సందర్శించి రైతులను అడిగి 24 గంటల ఉచిత విద్యుత్ పై ఆరా తీశారు. మండల కేంద్రం శామీర్ పేటలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందా లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ రమణారెడ్డి, అలియాబాద్ ఏఈ శ్రీనివాస్ గౌడ్, శామీర్ పేట ఏఈ సురేందర్ లైన్మెన్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం



**శామీర్ పేట, (గరుడ వార్త) :** రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఎంతోమందికి ప్రాణదానం చేయవచ్చని నల్సార్ వైస్ ఛాన్సర్ శ్రీకృష్ణదేవరావు అన్నారు. బుధవారం శామీర్ పేటలోని నల్సార్ యూనివర్సిటీ నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైస్ ఛాన్సర్ డాక్టర్ శ్రీకృష్ణదేవరావు ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలలో గాయపడిన వారికి రక్తదానంతో వారి ప్రాణాలను కాపాడవచన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రమాదాలలో గాయపడిన వారికి సహకరించి వారి ప్రాణాలు కాపాడాలని సూచించారు. మెదక్ తదితర ప్రాంతాలలో తల సేమియాతో బాధపడుతున్న పసిపిల్లలకు తమ యూనివర్సిటీలో సేకరించిన రక్తాన్ని అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో 80 మంది విద్యార్థులు రక్తాన్ని దానం చేశారని తెలిపారు. నల్సార్ లో 4వ సారి విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యుల్లత రెడ్డి, వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మోడీ సర్కార్‌పై ఖర్గే మండిపాటు



కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటోందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వెల్లడించారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డి ప్రభుత్వం తమ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసిందని, ఆదాయం పన్ను శాఖ తమ పార్టీపై భారీ జరిమానాలను విధించిందని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీని, బిజెపిని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలు రానున్న లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలలో ప్రతి రాజకీయ పార్టీకి సమాన అవకాశాలు ఉండాలని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ ఎన్నికల బాండ్ల ద్వారా వేల కోట్లను విరాళాల రూపంలో పుచ్చుకున్న బిజెపి వాటి వివరాలను మాత్రం వెల్లడించడానికి సిద్ధంగా లేదని ఖర్గే విమర్శించారు. తమ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలను ఐటి శాఖ ద్వారా స్తంభింపచేసి భారీ జరిమానాలను విధించిందని ఆయన ఆరోపించారు. ప్రజలు విరాళంగా ఇచ్చిన తమ పార్టీ నిధులను బిజెపి ప్రభుత్వం స్తంభింపచేసిందని, ప్రస్తుతం ఖర్చు చేయడానికి తమ వద్ద నిధులు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ దొంగతనం, తమ తుప్పుడు పనులు బయటపడతాయన్న భయంతోనే ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడికి జూలై వరకు సమయం కోరుతున్నారని ఆయన బిజెపిపై ఆరోపణలు గుప్పించారు.


గుజరాత్‌లో ఒక క్రికెట్ స్టేడియంకు ప్రధాని నరేంద్ర మోడీ తన పేరునే పెట్టుకోవడాన్ని ప్రస్తావిస్తూ ఎవరైనా మరణించిన తర్వాత వారి జ్ఞాపకార్థం వారి పేర్లను పెడతారని, కాని ఒక మనిషి బతికున్నపుడే తన పేర్లను వేటికీ పెట్టుకోడని ఖర్గే వ్యాఖ్యానించారు. 2019 ఎన్నికలలో తాను ఓడిపోయిన కలబురగి(గుల్బర్గా) నియోజకవర్గం ప్రజలు రానున్న ఎన్నికలలో తమ తప్పును సరిదిద్దుకోవాలని నిర్ణయించుకున్నారని, రానున్న ఎన్నికలలో కలబురగి(గుల్బర్గా)లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఓటమి ఎరుగని నాయకుడిగా పేరున్న ఖర్గే 2019 లోక్‌సభ ఎన్నికలలో బిజెపి అభ్యర్థి ఉమేష్ జాదవ్ చేతిలో 95,452 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. అనేక దశాబ్దాల రాజకీయ జీవితంలో ఖర్గేకు ఇదే తొలి ఓటమి. జాతీయ స్థాయిలో పార్టీని నడుపుతూ ప్రతిపక్ష ఇండియా కూటమిని సమన్వయపరుస్తున్న ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయకపోవచ్చని తెలుస్తోంది. ఆయనకు బదులుగా ఆయన అల్లుడు, ప్రముఖ విద్యా సంస్థల యజమాని, వ్యాపారవేత్త రాధాకృష్ణ దొడ్డమణి కలబురగి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఉంది. బిజెపి నేతలను మోసగాళ్లుగా అభివర్ణించిన ఖర్గే మోసగాళ్ల చేతిలో మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలంతా ఐక్యంగా ఉండి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని అంబేద్కర్ చెప్పారని, రాజ్యాంగమే లేకపోతే దేశంలో స్వేచ్ఛ, ఐక్యత ఎక్కడ ఉంటాయని ఆయన ప్రశ్నించారు. మళ్లీ దేశం బానిసత్వంలోకి వెళ్లిపోతుందని, ఇక మళ్లీ దేశం కోలుకునే పరిస్థితి ఉండదని ఆయన చెప్పారు. బిజెపి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతోందని, ప్రజలంతా దీనికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని సవరిస్తామంటూ బిజెపి ఎంపి అనంతకుమార్ చేసిన ప్రకటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం అల్లాటప్పాగా రాలేదని, దాని వెనుక ఎంతో మంది త్యాగాలు ఉన్నాయని ఖర్గే తెలిపారు.

# నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు.. కెసిఆర్‌ను కలిసేందుకు వచ్చా: ఆరూరి రమేశ్




తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని వర్ధన్నపేట బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ చెప్పారు. జూబ్లీహిల్స్ నందినగర్ లోని కేసీఆర్ నివాసానికి చేరుకుని ఆయనతో భేటి అయిన తర్వాత ఆరూరీ రమేష్ మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కెసిఆర్ ను కలిసేందుకు పార్టీ నేతలతో పాటు హైదరాబాద్ వచ్చానని ఆయన తెలిపారు. తాను బిజెపిలో చేరుతున్నానని వస్తున్నవార్తల్లో వాస్తవం లేదన్నారు. తానను అమిత్ షాను కలవలేదని.. ఎప్పటికీ బిఆర్ఎస్ లోనే ఉంటానని స్పష్టం చేశారు. అంతకుముందు ఈరోజు ఉదయం ఆరూరి రమేశ్ ఇంటి వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. బిజేపీలో చేరేందుకు నిర్ణయించుకుని.. ప్రెస్ మీట్ పెట్టేందుకు ప్రయత్నించిన ఆరూరిని బిఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్సీ సారయ్య తమ కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ఆరూరి అనుచరులు వారి కారుకు అడ్డంపడ్డారు. కొంతసేపు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువైపులా పోటాపోటీ నినాదాలు కొనసాగాయి. చివరకు ఆరూరితో సహా ఎర్రబెల్లి, సారయ్య హైదరాబాద్ చేరుకుని కెసిఆర్ తో సమావేశమయ్యారు.

# మనుగడకే గురిపెడుతున్న మానసిక యుద్ధం



ఊదరగొట్టుట అనే ప్రాపగాండాకు అనుబంధ ఫలితాలు అనే సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయి. జనంలో భయభక్తులను పెంచుకోవడానికి నాయకుడు ఇంద్రుడు చంద్రుడు వీరుడు శూరుడు అని ప్రచారం చేస్తారు. అట్లా చేయగా చేయగా, నిజమే కాబోలు అని ప్రతినాయకుడు అనుకుంటాడు, అంతేకాదు, నిజంగా తాను అరివీర భయంకరుణ్ణేమో అని ప్రచార నాయకుడు కూడా నమ్మడం మొదలుపెడతాడు. ఇతరుల మీద కమ్మే మాయపొర ఎంతో కొంత తమని కూడా మత్తులో ముంచుతుంది. నరేంద్రమోదీ, ఆయన పార్టీ వారు సామాన్యులు కాదు. ఉత్సాహం, వ్యూహం, ముందుజాగ్రత్త అన్నీ తగుపాళ్లలో ఉన్న మేధాబృందం వారికి ఉన్నది. తమ లక్ష్యసాధన గురించి జాగరూకత ఎంత ఉన్నప్పటికీ, రేపు కూడా తమదే అధికారం, పరమాధికారం అన్న బేఖాతరుదర్పం కూడా వారిలో తరచు పొడుచుకు వస్తోంది. పొగరుగా కనిపించే ఆ ధీమా కూడా వారి చేతిలో ఒక రాజకీయ పాచికే! మొన్న ఆదివారం నాడు కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. సాధారణ ఎన్నికలకు ముందు అదే చివరి సమావేశం. మంత్రులు ఎన్నికల ప్రచారాల్లో ఎట్లా ఉండాలి, ఏమేమి జనాలకు చెప్పాలి వంటి సుద్దులు ప్రధానమంత్రి తన సహచరులకు చెప్పారు. అది సరే. మరోసారి అధికారంలోకి వచ్చాక మొదటి వందరోజుల కాలంలో ఏమి చేయాలో మోదీ చర్చించారట. తన ప్రభుత్వమే వస్తుందని, తాను ప్రధాని అవుతానని అనుకోవడం ఓకే. సంభావ్యత అధికంగా ఉన్న విషయం అది. కానీ, ఈ మంత్రివర్గమే ఉండకపోవచ్చు కదా? అయినా, ప్రస్తుతం ఇంత హడావిడి నడుస్తుండగా, నూతన ప్రభుత్వమూ నూరురోజులూ అన్న మేధోమథన కార్యక్రమం ఎందుకు? వికసిత భారతాన్ని సాధించాలనే లక్ష్యం ప్రధానమంత్రిని ఆత్రుత పెడుతోంది అనుకుందాం, అందుకు సమయం సందర్భం చూసుకోనక్కరలేదా? నిజంగా, ఆ అంశం గురించి చర్చించడంలో పెద్ద విశేషం ఏమీ లేదు. అట్లా చర్చించినట్టు బయటకు చెప్పుకోవడంలోనే అసలు కిటుకు ఉన్నది. విశ్వసనీయవర్గాల ద్వారా బయటకు పొక్కిన ఆ రహస్యం ద్వారా ప్రతిపక్షాలు ఏమి అనుకోవాలంటే, మోదీ గారు గెలవడమే కాదు, మరో హయాం పాలన కూడా ఆరంభించారు, భవిష్యత్తు వర్తమానంలోకి చొచ్చుకు వచ్చేసింది, అని. ఇక ప్రజలు ఏమి అనుకోవాలంటే, చూశారా, మోదీ ఎప్పుడూ దేశ వికాసం కోసమే ఆలోచిస్తారు, ఆయన ప్రత్యర్థులే రాజకీయాలు చేస్తున్నారు, అని. ప్రతిపక్షాల మీద మానసికయుద్ధంలో మోదీ బ్రహ్మాస్త్ర ప్రయోగం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే మొదలయింది. సాధారణంగా, ఇటువంటి బడ్జెట్‌లు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతాయి. చాలాసార్లు, ప్రభుత్వాలకు తామే మళ్లీ గెలుస్తామన్న నమ్మకం నూటికి నూరుపాళ్లు ఉండదు. అందుకని, ఎన్నికల ప్రయోజనాల కోసం బడ్జెట్‌లో యథేచ్ఛగా వరాలు, వాగ్దానాలు గుప్పిస్తారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే అవన్నీ అమలుచేస్తామన్న వాగ్దానం ఆ బడ్జెట్ ఇస్తుంది. కానీ, మోదీ ప్రభుత్వం 2024 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఏ మాత్రం 'జనాకర్షణ' లేని విధంగా రూపొందించింది. తామే తిరిగి అధికారంలోకి వస్తామని అనుకుంటున్నారు కాబట్టి, అమలు చేయగలమా లేదా అన్న విచికిత్స వారి మీద పనిచేసింది. ప్రజల ఆధ్యాత్మికతను సంతృప్తిపరచడం ద్వారా ఎన్నికలను గెలవబోతున్నప్పుడు, భౌతిక అవసరాల గురించిన పెద్ద పట్టింపు అవసరం లేదన్న నిశ్చింతా వారికి ఉంది. తరువాతి పదవీకాలం కూడా తమదే అని అధికారపక్షం తమ ప్రత్యర్థులకు తేల్చిచెప్పింది. మీకేమీ తాయిలాలు ఇవ్వకపోయినా సరే, మీరు మమ్మల్ని గెలిపించడం కంటె మరేమీ చేయలేరు అని కూడా ప్రజలకు చెప్పింది. తెలంగాణలో కూడా అదే మానసిక యుద్ధతంత్రం నడుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ అంతరించిపోతుందని బీజేపీ అంటుంది. ఆరునెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని బీఆర్ఎస్ అంటుంది. బీజేపీ బీఆర్ఎస్ కలిసే ఉన్నాయని అసెంబ్లీ ఎన్నికల నాటి పాతపాటే కాంగ్రెస్ పాడుతుంది. ఎన్నికల ప్రచారానికి ఏవో వివాదాంశాలు అవసరం అవుతాయి. కానీ, తెలంగాణలో ఉన్న ప్రస్తుత వాతావరణం, ప్రభుత్వాల, పార్టీల మనుగడలనే చర్చలోకి తెచ్చింది. జాతీయ రాజకీయ సమరంలో తలపడుతున్న రెండు జాతీయపార్టీలు, మొన్నటిదాకా పదేళ్లు అధికారంలో, మరో పదమూడేళ్లు ఉద్యమంలో ఉన్న ప్రాంతీయపార్టీ, తమ తమ శక్తియుక్తులన్నిటిని ఉపయోగించి, ఎన్నికల గండాన్ని దాటడానికి ప్రయత్నిస్తున్నాయి. నిజానికి, ఈ ఎన్నికలు బీజేపీకి గండం కావు. ఈ ఎన్నికల ఫలితాల వల్ల కొత్తగా ఏ నష్టమూ పొందనిది బీజేపీ ఒక్కటే. ప్రస్తుతం ఉన్న స్థానాలను నిలుపుకున్నా చాలు. కాంగ్రెస్ అనుకూలత నేపథ్యంలో కూడా తన బలాన్ని కాపాడుకున్నట్టు అవుతుంది. అదనంగా స్థానాలు గెలుచుకుంటే, పురోగమిస్తున్నట్టు లెక్క. సగానికి పైగా గెలిస్తే, ఆపైన తిరుగుండదు. ఉన్న సీట్లకు తగ్గితే కూడా, అర్థం చేసుకోదగ్గ పరిణామమే తప్ప, పెద్ద పతనం కాదు. కాబట్టి, బీజేపీ ఒక సౌకర్యవంతమైన స్థితినుంచి పోరాటంలోకి దిగుతోంది. దాని ప్రయత్నం అంతా మెరుగుదల కోసమే. ఆ మెరుగుదల వస్తే, రాష్ట్ర రాజకీయాలను కూడా మలుపుతిప్పగలిగిన పరిణామాలకు అవకాశం ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరిస్థితి అట్లా లేదు. వాటికి జీవన్మరణ సమస్య. అసెంబ్లీ విజయానికి తగినట్టు, అంతకు మించి విజయాలు రాకపోతే, రేవంత్ రెడ్డికి అధిష్ఠానం దగ్గర రేటింగ్ తగ్గవచ్చు, లేదా, ఇంటిపోరు అధికం కావచ్చు. తమకు మంచి గెలుపు రావడం ఒక్కటే సరిపోదు, బీఆర్ఎస్‌కు అనూహ్యమైన విజయాలు ఏమీ రావు కానీ, బీజేపీకి అదనపు బలం సమకూరకూడదు. కాంగ్రెస్ పది గెలిచి, తక్కినవి బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం దక్కించుకుంటే ఓకె. అట్లా కాకపోతే, అదనపు గెలుపులతో బీజేపీలోకి వలసలు పెరిగిపోతాయి. కొందరు నిబద్ధులు ఉన్న మాట నిజమే కానీ, బీఆర్ఎస్ శా??సన?సభ్యులు అనేకులు తమకు ఉన్నచోట భవిష్యత్తు లేదన్న చింతలో పడిపోయారు. వారికి సహజంగానే బీజేపీ ఒక ఆకర్షణీయ గమ్యంగా కనిపిస్తుంది. ఇక అప్పుడు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు అనుమతించాలన్న తాత్విక ప్రశ్న బీజేపీ ఢిల్లీ పెద్దలలో తలెత్తవచ్చు. బీఆర్ఎస్‌ది ప్రస్తుతానికి దయనీయ పరిస్థితే. లోక్‌సభ ఎన్నికలలో ప్రచారాంశమే లేని పార్టీ ఇది. కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి అయినా, బీజేపీకి వేయడానికి అయినా ఓటరుకు తగిన కారణాలున్నాయి. మరి బీఆర్ఎస్ ఎంపీలు ఢిల్లీకి పోయి ఏమి సాధిస్తారు? అట్లాగని, ఎన్నికలను వదులుకోలేరు. మొన్నటి ఎన్నికలలో బలం చూపిన చోట్ల అయినా, ఎంపీలను గెలిపించుకోవాలి. లేకపోతే, ఎమ్మెల్యేల బలగాన్ని నిలుపుకోవడం కష్టం. కానీ, గత పదేళ్ల దాని పరిపాలనా కాలాన్నే కాంగ్రెస్ వివాదాస్పదం చేస్తున్నది. ఇంకా నాలుగున్నరేండ్ల కాలం ఎడారిలాగా కనబడుతుంటే, పార్టీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. కాంగ్రెస్ నుంచి, బీజేపీ నుంచి కూడా బీఆర్ఎస్ వేట ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. బీజేపీ మీద కాకుండా, రేవంత్ రెడ్డి తన అస్త్రాలన్నిటినీ బీఆర్ఎస్ మీద ఎందుకు గురిపెడుతున్నట్టు? బీఆర్ఎస్ లక్ష్యం కూడా రేవంత్ మాత్రమే ఎందుకు అవుతున్నారు? బీఆర్ఎస్ నుంచి సిద్ధంగా ఉన్న వలసలను కాంగ్రెస్ ఎందుకు ఆపుతున్నది? అదనపు బలాన్ని సమకూర్చుకుని, ఆత్మవిశ్వాసంతో లోక్‌సభ ఎన్నికలకు వెళ్లకుండా, దిగువశ్రేణి నేతల వలసలతోనే ఎందుకు తృప్తి చెందుతున్నట్టు? ఎన్నికల తరువాత బలం పెంచుకుందామనుకుంటున్నారేమో కానీ, అప్పటికి బీఆర్ఎస్ శిబిరంలో ఎవరైనా మిగులుతారా? ప్రధానమంత్రి పర్యటనలో రేవంత్ వ్యవహరించిన తీరు కాంగ్రెస్‌కు లాభమా? నష్టమా? తెలంగాణ అస్తిత్వ స్పృహ రేవంత్‌లో కనిపించడం లేదన్న విమర్శ బీఆర్ఎస్ తిరిగి ఉద్యమ ఉద్వేగాలను ఆశ్రయించనున్నట్టు సూచిస్తోందా? మోదీ చెప్పిన సర్జికల్ స్ట్రయిక్ అంతరార్థమేమిటి? ఇంతకీ, లోక్‌సభ ఎన్నికలలో తెలంగాణలో ప్రధాన పోటీ ఏ రెండు పార్టీల మధ్య? ఇవన్నీ తెలంగాణ రాజకీయరంగాన్ని కుదిపివేస్తున్న ప్రశ్నలు. తమ పార్టీ మిగులుతుందా లేదా అన్న ఆందోళనలో ఒక పార్టీ, తమ ప్రభుత్వానికి గండం ఉందేమోనన్న భయంలో మరో పార్టీ సతమతమవుతున్నాయి. ఆ కలవరాన్ని మరింతగా పెంచిపోషిస్తూ బీజేపీ తమాషా చూస్తున్నది.

# బకాయిదారులకు శుభవార్త...!



**వనపర్తి :** మునిసిపాలిటీల్లో ఏళ్ల తరడి పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను వడ్డీ వసూలుపై ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగింపు దశ దగ్గరపడుతున్న తరుణంలో మొండి బకాయి దారుల నుంచి ఎలాగైన ఆస్తి పన్ను వసూలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎరియర్స్ పెండింగ్‌పై 90 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ వనపర్తి మునిసిపాలిటీలో వడ్డీ రాయితీని వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారనే విమర్శలకు నిజం చేకురుతుంది. ఈ ఆర్థిక సంవత్సరం ఈనెల రోజుల్లో ముగిస్తుండటంతో ఫిబ్రవరి నెల ముగిసేనాటికి కేవలం 37 శాతం మాత్రమే వసూలు చేయడం అధికారుల నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపిస్తోంది. వనపర్తి మునిసిపాలిటీలో ఉన్న 16,940 అసిస్మెంట్ (ఇంటి నెంబర్ నమోదు) లను వసూలు చేయడానికి ఎనిమిది మంది బిల్ కలెక్టర్లు ప్రతీరోజు పన్ను వసూలు చేయడం కోసమే ఉన్నారు. వనపర్తి మునిసిపాలిటీలో ఉన్న 16,940 అసిస్మెంట్లకు గాను ఈ ఏడాది రూ. 8 కోట్ల 57 లక్షలు వసూలు టార్గెట్ ఉంది. కానీ మార్చి 4వ తేదీ నాటికి రూ. 3 కోట్ల 23 లక్షలు వసూలు చేశారు. దీంతో 37 శాతం మాత్రమే ఆస్తి పన్ను పెండింగ్ బిల్లులు వసూలు చేశారు. ప్రభుత్వం కల్పించిన రాయితీలో ఎరియర్స్ రూ. 4 కోట్లు ఉంది. అందులో 4వ తేదీ నాటికి రూ. 1 కోటి 10 లక్షలు వసూల్ చేశారు. వడ్డీ రాయితీలో ప్రజలు సద్వినియోగం చేసుకుంటే ఉన్న పెండింగ్ బిల్లులో చాలా వరకు మాఫీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాంటి అవకాశాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల నేటికి ప్రభుత్వం కల్పించిన రాయితీ విషయం చాలా మందికి తెలియకుండా గుట్టుగానే ఉంది.

# జిల్లాలో పడిపోతున్న భూగర్భజలాలు

## – వేసవి తొలినాళ్లలోనే సాగునీటి కష్టాలు
## – బోర్లు, బావుల్లో అంతంతమాత్రంగానే ఊట



**సిద్దిపేట :** నంగునూరు మండలం పాలమాకులకు చెందిన రైతు సత్యనారాయణ తనకున్న మూడెకరాల్లో వరిని సాగు చేస్తున్నాడు. ఇందుకు సుమారు రూ. 70వేల దాకా పెట్టుబడి పెట్టాడు. అయితే బావిలో నీరు అడుగంటడంతో నీటి కొరత ఏర్పడింది. ప్రస్తుతం రెండెకరాలకే నీరందుతోంది. ఈ క్రమంలో ఎకరం పొలం ఎండిపోగా తన పాడిగేదె మేస్తూ కనిపించింది. ఇదే పరిస్థితి ఉంటే మిగతా రెండు ఎకరాలు కూడా ఎండిపోతుందని ఆవేదన చెందాడు. గతేడాది చెరువుల్లోకి సమృద్ధిగా నీరు విడుదల చేయడంతో మూడెకరాల్లో పంట పండిందని చెప్పాడు. ఈ దుస్థితి సత్యనారాయణ రైతొక్కడిదే కాదు. యాసంగిలో వరి సాగు చేస్తున్న చాలా మంది రైతులది ఇదే గాథ. నాలుగైదేళ్లుగా యాసంగిలో పంట పండుతుండటంతో ఈసారి ముందడుగు వేశారు. కానీ, భూగర్భజలాలు అడుగంటడం, గోదావరి జలాల ఎత్తిపోతలు నిలిచిపోవడంతో సాగునీటికి తీవ్ర కటకట మొదలైంది. నాలుగేళ్ల నుంచి సమృద్ధిగా ఉంటున్న భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. జిల్లాలో సగటున గతేడాది ఇదే సమయంలో 8.66 మీటర్ల లోతున ఉన్న భూగర్భజలాలు ప్రస్తుతం 10.07 మీటర్ల అడుగులోకి చేరాయి. వేసవి ఆరంభంలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఇంకెలాంటి దుస్థితి ఏర్పడుతుందోననే ఆందోళన వణుకు పుట్టిస్తోంది. గతేడాది మే నెలలో 10.82 మీటర్ల లోతున భూగర్భజలాలు ఉండగా మూడు నెలల ముందుగానే జిల్లాలో ఆ పరిస్థితి దాపురించింది. ఫిబ్రవరి మూడో వారం నుంచి ఎండలు ప్రారంభం కావడంతోనే భూగర్భజలాలు పాతాళం దిశగా అడుగంటుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించాలంటే రిజర్వాయర్ల ద్వారా నీటిని చెరువులు, చెక్‌డ్యాములు, కుంటలు, వాగుల్లోకి తరలించాలి. ఇలా చేయడం వల్ల కొంతవరకైనా భూగర్భజలాల స్థాయిని పెంచే ఆస్కారం ఉంటుంది. జిల్లాలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.9 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో 3 టీంఎసీల సామర్థ్యంతో నిండుగా ఉంది.

# పాక్ ప్రథమ మహిళగా అధ్యక్షుడి కుమార్తె...!



**ఇస్లామాబాద్ :** సాధారణంగా దేశాధ్యక్షుడి సతీమణిని ప్రథమ మహిళగా ప్రకటించడం ఆనవాయితీ. అధ్యక్షుడి సతీమణి మరణించినట్లయితే ఎవరు ఆ స్థానంలో కొనసాగుతారనేది ఆసక్తికరమైన ప్రశ్న. పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ (68) భార్య బెనజీర్ భుట్టో 2007లో హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో తన చిన్న కుమార్తె 31 ఏళ్ల అసీఫా భుట్టోను ప్రథమ మహిళగా నియమించనున్నట్లు తెలుస్తోంది. జర్దారీ పెద్ద కుమార్తె బఖ్తావర్ ఆదివారం చేసిన ట్వీట్ ఈ విషయాన్ని నిర్ధారించింది. పాకిస్థాన్‌కు 14వ అధ్యక్షుడిగా జర్దారీ ప్రమాణం చేసినప్పుడు చిన్న కుమార్తె అసీఫా ఆయన వెంటే ఉన్నారు. జర్దారీపై కోర్టు కేసుల విచారణ మొదలుకొని జైలు నుంచి విడుదల కోసం అసీఫా పోరాడారని, ఇప్పుడు ప్రమాణ స్వీకార సందర్భంలో ప్రథమ మహిళగా ఆయన వెంటే ఉన్నారని బఖ్తావర్ ట్వీట్ చేశారు. 2008-2013 కాలంలో జర్దారీ మొదటిసారి దేశాధ్యక్ష పదవిని చేపట్టినప్పుడు ప్రథమ మహిళ స్థానం ఖాళీగానే ఉంది. రెండోసారి అధ్యక్షుడైన తరవాత చిన్న కుమార్తెకు ఆ హోదా ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. భార్య మరణించిన సందర్భాల్లో ప్రథమ మహిళగా కుమార్తెనో, సోదరినో, మేనకోడలు లేదా సోదరుడి కుమార్తెనో నియమించడమనేది ఇతర దేశాల్లో కొత్తమీ కాదు.

# సుమత్రా దీవిలో ఆకస్మిక వరదలు...!



జకార్తా : ఇండోనేషియాలోని సుమత్రా దీవిలో కుండపోత వర్షాలతో ఆకస్మికంగా సంభవించిన వరదలు, మట్టిపెళ్లలు విరిగిపడిన సంఘటనల్లో 26మంది మరణించగా, మరో 11మంది గల్లంతయ్యారని అధికారులు సోమవారం తెలిపారు. గురువారం నుండి పశ్చిమ సుమత్రా ప్రావిన్స్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో 9 జిల్లాలు, నగరాలు నీట మునిగాయి. నదులు పొంగి పొర్లుతున్నాయి. శుక్రవారం పొద్దుపోయిన తర్వాత పెద్ద ఎత్తున మట్టిపెళ్లలు, కొండచరియలు విరిగిపడడంతో నది కట్టలు తెగి ఊర్లలోకి వరద ప్రవహించింది. సెలాటన్ జిల్లాలో కొండల పక్కన గల గ్రామాలన్నీ చిన్నాభిన్నమయ్యాయి. ప్రస్తుతానికి నీటి మట్టం తగ్గడంతో సహాయక సిబ్బంది మరిన్ని మృతదేహాలను వెలికితీస్తున్నారు. విద్యుత్ లేకపోవడం, వంతెనలు తెగిపోవడం, రహదారులు ధ్వంసమవడం, పెద్ద మొత్తంలో బురద, రాళ్లు రప్పలతో కూడిన శిథిలాల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. సెలాటన్, దాని పొరుగునే గల పరియామన్ జిలాల్లోని అనేక గ్రామాలు బాగా దెబ్బతిన్నాయని, మరణాలు, నష్టం అక్కడే ఎక్కువ సంభవించిందని సంస్థ ప్రతినిధి అబ్దుల్ ముహారి తెలిపారు. వర్షాల కారణంగా 37వేలకు పైగా ఇళ్లు, భవనాలు నీట మునిగాయి. మూడు ఇళ్లు వరద ఉధృతికి కొట్టుకుపోయాయని చెప్పారు.

# ఆకలితో గాజాలో రంజాన్....!



**గాజా :** గాజా నగరంలో ఆకలి, బాంబుల మధ్య పాలస్తీనియన్లు రంజాన్ ప్రారంభానికి సిద్ధమయ్యారు. కాల్పుల విరమణ చర్చలు నిలిచిపోవడంతో ఈ ఏడాది రంజాన్ తీవ్ర అభద్రతా స్థితిలో ఉంది. ఇఫ్తార్‌లో అలంకరించుకోవడానికి ఇళ్లు లేదు, విందు చేయడానికి ఆహారం లేదు. "ఈసారి ప్రత్యేకంగా ఎలాంటి సన్నాహాలు చేయడం లేదు. మా దగ్గర క్యాన్డ్ ఫుడ్ మాత్రమే ఉంది. చాలా ఆహార పదార్థాలు ఊహించలేనంత ఖరీదైనవి" అని రఫాలోని శరణార్థి మహా అన్నారు. దక్షిణ గాజాలోని రఫాలో, సగం జనాభా ప్లాస్టిక్ గుడారాలలో నివసిస్తున్నారు. కాగా, గాజాలో ఇజ్రాయెల్ దాడిలో మరణించిన వారి సంఖ్య 31,045 దాటింది. ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగిస్తోంది. నుసైరత్ శరణార్థి శిబిరం, అల్-మవాసి ప్రాంతంలో మహిళలు, పిల్లలు సహా 15 మంది మరణించారు. ఆహారం దొరకక ఉత్తర గాజాలో పౌష్టికాహార లోపంతో ఓ పసికందు, యువతి చనిపోయారు. దీంతో ఆకలి చావులతో మరణించిన వారి సంఖ్య 25కి చేరింది. రంజాన్ సమీపిస్తుండటంతో, ఇజ్రాయెల్ జెరూసలేంలోని అల్-అక్సా మసీదు చుట్టూ వేలాది మంది పోలీసులను మోహరించింది. వెస్ట్ బ్యాంక్ కూడా గట్టి నియంత్రణలో ఉంది.

# చైనా ఆధునీకరణపైనే దృష్టి....!

బీజింగ్ : చైనా ఆధునీకరణపైనే పూర్తిగా దృష్టి సారిస్తూ చైనా అత్యున్నత రాజకీయ సలహా సంప్రదింపుల సంస్థ ి చైనా పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సిపిపిసిసి) 14వ జాతీయ కమిటీ సమావేశాలు ఆదివారంతో ఇక్కడ ముగిశాయి. రెండు సెషన్లుగా జరిగిన ఈ సమావేశాల్లో రాజకీయ సలహాదారులు పలు అంశాలపై సమర్ధవంతమైన, ఆచరణ్మాకమైన చర్చలు జరిపారు. దీర్ఘకాలంగా నలుగుతున్న సమస్యలతో పాటు కొత్తగా ముందుకొస్తున్న సమస్యలపైనా వారు దృష్టి సారించారు. అలాగే కృత్రిమ మేధస్సు (ఎఐ) అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్ళడానికి వ్యూహ రచనతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించడంపై వారు చర్చించారు. జాతీయాభివృద్ధి నుండి జీవనోపాధి వరకు అన్ని అంశాలు ఈ సమావేశాల్లో చర్చకు వచ్చాయి. ఈ సవాళ్ళన్నీ సమర్ధవంతంగా ఎదుర్కొని, అధిగమించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సిపిపిసిసి సంకల్పించింది. ఈ సంస్థ



జాతీయ కమిటీ చైర్మన్ వాంగ్ హ్యునింగ్ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ, చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) నేతృత్వంలో చైనా ఆధునీకరణకు సంబంధించి మెరుగైన అవగాహన కలిగిఉండాలన్నారు. వివిధ కోణాల్లో చైనా ఆధునీకరణను మరింత ముందుకు తీసుకెళ్ళడంపై ఈ ఏడాది అనేక ప్రతిపాదనలు వచ్చాయి.


# ఎన్నికల్లో బరిలో లేని ఖర్గే....!



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగే అవకాశం లేదని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఎన్నికల్లో ఖర్గే పోటీ చేయకుండా.. ఆ పార్టీని ముందుండి నడిపించాలని, ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ బిజెపితో తలపడేలా పార్టీని అన్నివిధాలా సన్నద్ధం చేసి ఎక్కువ మంది అభ్యర్థులను గెలిపించేందుకు ఖర్గే కృషి చేయాలని సీనియర్ నేతలు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. సీనియర్ నేతల అభిప్రాయం మేరకు ఆయన లోక్‌సభ ఎలక్షన్స్‌లో పోటీకి దిగడం లేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. తాజాగా కర్ణాటక గుల్బార్గా నియోజకవరగం నుంచి ఖర్గే పోటీ చేయాలని ఆ పార్టీ వర్గాలు భావించాయి. ఆయన పేరును కర్ణాటక సీనియర్ నేతలంతా గతవారం ఏకగ్రీవంగా ఆమోదించారు. కానీ ఖర్గే మాత్రం ఆయన అల్లుడు రాధాకృష్ణను ఆ స్థానం నుంచి నిలబెట్టే అవకాశం ఉంది. ఆయన పేరును నామినేట్ చేసే అవకాశమున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు మీడియాకు తెలిపాయి. కాగా, ఖర్గే గుల్బార్గా నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచారు. కానీ 2019లో ఓడిపోయారు. అయితే ఆయన ప్రస్తుతం రాజ్యసభలో ప్రతిపక్షనేతగా ఉన్నారు. ఎగువ సభలో ఈయన పదవీకాలం మరో నాలుగేళ్లు ఉంది. ఈ ఎన్నికల సందర్భంగా ఆయన పోటీ చేయకపోవడంపై ఖర్గే మాట్లడుతూ.. 'నేను ఒక నియోజకవర్గానికి మాత్రమే పరిమిత్రం కావాలని కోరుకోవడం లేదు. దేశమంతటా దృష్టి కేంద్రీకరించాలనుకుటున్నాను.' అని అన్నారు. ఇక ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే కర్ణాటక సిద్ధరామయ్య మంత్రివర్గంలో మంత్రిగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన ఆసక్తిగా లేరని సమాచారం. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిలో ఉంటే పోటీ చేయకూడదనే దాఖలు లేవు. గతంలో అధ్యక్ష పదవి చేపట్టిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. ఈసారి ఖర్గే మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయకపోవడం గమనార్హం.

# 6 వారాల కాల్పుల విరమణకు ప్రయత్నిస్తున్నాం

దుబాయ్: గాజాలో ఆరువారాల కాల్పుల విరమణ దిశగా తాము ప్రయత్నిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. "గాజాకు మరింత మానవతా సాయం అందిస్తాం. మరోవైపు కనీసం ఆరు వారాల కాల్పుల విరమణ కోసం ప్రయత్నిస్తున్నాం. అంతేకాదు ఈ ప్రాంత దీర్ఘకాల భవిష్యత్తుకు, సుస్థిరతకు, శాంతికి మా వంతు కృషి చేస్తాం. ఇందులో పాలస్తీనీయన్లు, ఇజ్రాయెలీలు ఒకే రకమైన స్వేచ్ఛ, గౌరవం, భద్రతతో బతికేందుకు అవకాశం కల్పించే ద్విదేశ పరిష్కారమూ ఉంది" అని పేర్కొన్నారు. హమాస్‌తో పోరు విషయంలో జో బైడెన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తప్పుపట్టారు. "నేను మెజార్టీ ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్నానని, దేశ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని బైడెన్ భావిస్తే.. అది పూర్తిగా తప్పు' అని వ్యాఖ్యానించారు. హమాస్ లెక్కల ప్రకారం.. గాజాలో 31వేలమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య గురించి ప్రశ్నించగా..'అది నాకెలా తెలుస్తుంది. మా సైనికులు 13 వేలమంది మిలిటెంట్లను హతమార్చారు' అని తెలిపారు. దాదాపు 1.3 మిలియన్ల పాలస్తీనీయులు ఆశ్రయం పొందుతున్న



రఫా ప్రాంతాన్నీ ఇజ్రాయెల్ ఆక్రమించే అవకాశం ఉందన్న వార్తలపై బైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. బెంజమిన్ వైఖరి సొంత దేశాన్నే గాయపరుస్తోందని ఆక్షేపించారు. ఎర్రసముద్రంలో సోమవారం మరో నౌకపై హూతీ తిరుగుబాటుదారులు దాడి చేశారు. నౌకలోని సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు. యెమెన్ నుంచి హూతీలు ప్రయోగించిన క్షిపణి నౌక సమీపంలో పడి భారీ పేలుడు సంభవించిందని బ్రిటన్ మారిటైమ్ వర్గాలు తెలిపాయి.

# ఎంఎన్‌సిలకు యుద్ధం సెగ....!

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందంట ఇదేనేమో! ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే ప్రస్తుతం మధ్య ప్రాచ్యంలో హమాస్‌కు ఇజ్రాయెల్‌కు మధ్య యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో ముస్లిం దేశాలన్నీ కలిసి పాశ్చాత్య దేశాల వస్తువులను కొనుగోలు చేయరాదని నిర్ణయించాయి. దీని ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అతిపెద్ద బహుళ జాతి సంస్థలపై పడింది. అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. దీంతో పలు దేశాల్లో ఉద్యోగాల్లో కోత విధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది అక్టోబర్ 7వ తేదీన హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై దాడి చేసి సుమారు 1,200 మందిని చంపి.. 250 మందిని కిడ్నాప్ చేసి తమ వెంట తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య యుద్ధం తీవ్ర స్థాయిలో జరుగుతోంది. ఇజ్రాయెల్ గాజాను నేల మట్టం చేసింది. సుమారు 30 వేల కంటే ఎక్కువే మంది చనిపోయారు. వారిలో మహిళలు, పిల్లలే ఎక్కువగా ఉన్నారు. అలాగే లక్షలాది మంది గాయపడ్డారు. ప్రస్తుతం వారికి వైద్య సదుపాయాలు లేవు. తినడానికి తిండి లేదు. ఉండటానికి ఇళ్లు లేకుండా ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన గుడారాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇవన్నీ ముస్లిం దేశాలకు ఆగ్రహం తెప్పిస్తాయనడంలో ఎవరికి ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. దీంతో ముస్లిం దేశాలు ఎక్కువగా ఉండే ఆగ్నేయాసియా, పశ్చియ ఆసియా ప్రజలు పాశ్చాత్య దేశాల వస్తువులను బాయ్‌కాట్ చేయాలని పిలుపు ఇచ్చారు. దీంతో బహుళ జాతి కంపెనీల అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. బాయ్‌కాట్ ఎంఎన్‌సి పిలుపుఇవ్వడంతో స్టార్‌బక్స్, మెక్‌డొనాల్డ్ యూనీలీవర్ వ్యాపారం ఆగ్నేయాసియా, పశ్చిమ ఆసియాలో బాగా పడిపోయాయి. పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికాకు చెందిన ఫ్రాంచైజీ ఆపరేటర్ అమ్మకాలు తగ్గడంతో సిబ్బందిని తగ్గించుకోవాల్సి వచ్చిందని చెప్పారు. గాజా వార్ ప్రభావం తమ సేల్స్‌పై కనిపిస్తోందని వివరించారు. కేవలం స్టార్‌బక్స్ మాత్రమే కాదు. మెక్‌డొనాల్డ్ యూనీలీవర్‌ల అమ్మకాలు కూడా బాగా తగ్గిపోయాయి. గాజాలో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డం చూసిన తర్వాత ముస్లిం దేశాలు పాశ్చాత్య దేశాల ఉత్పత్తుల కొనుగోలు చేయరాదని నిర్ణయించాయి. దీంతో పాశ్చాత్య దేశాలకు చెందిన దిగ్గజ కంపెనీలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయి. ఉదాహరణకు స్టార్‌బక్స్, మెక్‌డొనాల్డ్ యూనీలీవర్ అమ్మకాలు పశ్చిమాసియాతో పాటు ఇతర ఇస్లామిక్ దేశాలతో పాటు ఆగ్నేయాసియాలో అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. ఈ దేశాల్లోని ప్రజలు అతి పెద్ద కంపెనీల ఉత్పత్తుల కొనుగోళ్లను నిలిపి వేశారు. దీంతో కంపెనీలు కూడా పెద్ద ఎత్తున లే ఆఫ్‌లు ప్రకటించేశాయి. ఉదాహరణకు కువైట్‌కు చెందిన అల్‌షయా గ్రూపును తీసుకుంటే దేశంలోని తమ స్టోర్‌లలో పెద్ద ఎత్తున లే ఆఫ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గత బుధవారం నాడు కంపెనీ సిఇఒ సిఎన్ఎన్‌కు చెప్పారు. గాజాలో పరిస్థితులు దారుణంగా తయారైన తర్వాత ఈ పరిస్థితి మొదలైంది అన్నారు. వాస్తవానికి గత మంగళవారం నాడు రాయిటర్స్ వార్తా సంస్థ అల్‌షయా గ్రూపు కంపనీ స్టార్‌బక్స్ బ్రాండ్ ఫ్రాంచైజీ తమ సంస్థ నుంచి సుమారు 2,000 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. అయితే అల్‌షయా గ్రూపు మాత్రం ఈ సంఖ్యను నిర్ధారించలేదు. కాగా ఈ కంపెనీలో సుమారు 50 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. కనీసం 4% మంది ఉద్యోగులపై వేటు పడే అవకాశం ఉందని కంపెనీ వర్గాలే చెబుతున్నాయి. ఇక స్టార్‌బక్స్‌ను తీసుకుంటే మధ్యప్రాచ్యంతో పాటు ఉత్తర ఆఫ్రికాలోని 11 దేశాల్లో సుమారు 1,900 స్టోర్‌లు నిర్వహిస్తోంది. సుమారు 19 వేల మంది ఈ స్టోర్‌లలో పని చేస్తున్నారు. అయితే ఈ ఏడాది జనవరిలో స్టార్‌బక్స్ వార్షిక అమ్మకాల అంచనాను గణనీయంగా తగ్గించుకుంది. ఎందుకంటే పశ్చిమాసియాలో గాజా- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం మొదలైనప్పటి నుంచి సేల్స్ అంచనాను కుదించాయి. అంతేకాకుండా 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మార్కెట్ అంచనాలను కూడా చేరుకోలేకపోయింది. సియాటెల్ ప్రధాన కార్యాలయంగా పని చేస్తున్న ఈ కాఫీ చెయిన్ దిగ్గజం గత కొంత కాలం నుంచి తాము ఇజ్రాయెల్‌కు అనుకూలం కాదని పెద్ద ఎత్తున ప్రకటనలు గుప్పిస్తున్నా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. తమ వెబ్‌సైట్‌లో ఎఫ్ఎక్యూ సెక్షన్‌లో తమ కంపెనీకి టెల్ అవీవ్‌తో ఎలాంటి సంబంధాలు లేవని.. అక్కడి ప్రభుత్వానికి తమ మద్దతు లేదని కూడా వివరణ ఇచ్చుకుంది. అయినా అమ్మకాలు మాత్రం పుంజుకోవడం లేదు కదా మరింత తగ్గుముఖం పడుతున్నాయి. ఈ సెగ కేవలం స్టాక్‌బక్స్‌కు మాత్రమే కాదు. ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు మెక్‌డొనాల్డ్ యూనీలీవర్‌కు కూడా తాకింది. యూనీలీవర్ బ్రాండ్‌లు అయిన డోవ్, సన్‌సిల్క్, రెక్సోనా అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. యూనీలీవర్ ఆగ్నేయాసియా అమ్మకాలు ఇండోనేషియాలో రెండంకెల్లో తగ్గాయని కంపెనీ ఈ నెల 8వ తేదీన ఎర్నింగ్ కాల్స్‌లో వెల్లడించింది. ఇండోనేషియాలో నాలుగో త్రైమాసికంలో అమ్మకాలు డబుల్ డిజిట్‌లో తగ్గుముఖం పడతాయని బహుళ జాతి కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి.అలాగే మెక్ డొనాల్డ్ కంపెనీ సిఈఓ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మధ్యప్రాచ్య దేశంలో పాటు ఇతర ముస్లిం దేశాలు ఉదాహరణ మలేషియా, ఇండోనేషియాలో అమ్మకాలు తగ్గాయని మెక్ డొనాల్డ్ సిఈఓ క్రిస్ కెంప్‌జినికి తెలిపారు. గాజా, ఇజ్రాయెల్ యుద్ధం జరిగినంత కాలంలో పరిస్థితులు మెరుగుపడే అవకాశాల్లేవని మెక్‌డొనాల్డ్ సిఇఒ భావిస్తున్నారు. ప్రస్తుతం గాజాలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ప్రభావం తమ బ్రాండ్‌లపై కనిపిస్తోందన్నారు.

# పుచ్చకాయను నిల్వ ఉంచితే ప్రమాదమా.....?



పుచ్చకాయ.. ప్రస్తుతం రోడ్డు మీద వెళ్తున్న షాపింగ్ చేస్తున్న ఇంటి దగ్గర ఉన్న ఇలా ఎక్కడ ఉన్నా కళ్ళ ముందు కనిపించే పండు. వేసవికాలం వచ్చిందంటే చాలు ప్రతి ఒక్కరి కన్ను పుచ్చకాయ పైన పడుతుంది.ఇక ఈ పండులో అటు 90% నీరు ఉంటుంది. దీంతో మండు టెండల నుంచి ఇక ఈ పండు తినడం ద్వారా ఉపశమనం పొందాలని అందరూ అనుకుంటూ ఉంటారు. అయితే ఇందులో విటమిన్ ఏ, విటమిన్ బి, విటమిన్ సి తో పాటు క్లోరిన్, బీటా కెరొటీన్, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు కూడా చాలానే ఉంటాయి ఇక ఇవన్నీ ఎండ తాపం నుంచి రక్షణ కల్పిస్తూ ఉంటాయి అన్న విషయం తెలిసిందే. అంతేకాకుండా తరచూ ఎండల్లో తిరుగుతూ ఉండేవారు ఇక పుచ్చకాయ తినడం వల్ల డిహైడ్రేషన్ బారి నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఎందుకంటే వడదెబ్బ తగలకుండా ఈ పండు అటు శరీర ఉష్ణోగ్రతను సమతుల్యం చేస్తూ ఉంటుంది అని చెప్పాలి. అంతేకాకుండా ఇక ఎండాకాలంలో వచ్చే ఎన్నో చర్మ రోగాలు కూడా పుచ్చకాయ తినడం వల్ల తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతూ ఉంటారు. దీంతో సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరికీ అందుబాటు ధరలో ఉండే ఈ పుచ్చకాయను కొనుగోలు చేసి ప్రతిరోజు తినడం ఒక అలవాటుగా మార్చుకుంటూ ఉంటారు ప్రతి ఒక్కరు. అయితే తరచూ మార్కెట్ కు వెళ్లి ఎందుకు పుచ్చకాయ కొనడం అని భావించి.. కొంతమంది ఇక పుచ్చకాయను కొనుగోలు చేసి ఇంట్లో ఫ్రిడ్జ్ లో భద్రపరుచుకుని తినడం చేస్తూ ఉంటారు. పుచ్చకాయ పెద్ద ఆకారంలో ఉంటుంది కాబట్టి కుటుంబ సభ్యులందరూ తిన్న కూడా ఇంకా మిగిలి ఉంటుంది. దీంతో దానిని ఫ్రిడ్జ్ లో భద్రపరచడం చేస్తూ ఉంటారు. ఇలా చేస్తే ప్రమాదంలో పడినట్లే అని హెచ్చరిస్తున్నారు నిపుణులు ఫ్రిడ్జ్ లో పుచ్చకాయను భద్రపరచడం వల్ల అందులోని పోషకాలు నశించే అవకాశం ఉంటుంది. 90 శాతం నీరు కలిగిన పుచ్చకాయని ఫ్రిడ్జ్ లో పెడితే అందులోని శీతల ఉష్ణోగ్రత పండు పై ప్రభావం చూపే అవకాశం ఉంటుందట. ఇక కట్ చేసిన పుచ్చకాయలో వేగంగా బ్యాక్టీరియా ఏర్పడుతుందని నిపుణులు అంటున్నారు. అలా బ్యాక్టీరియా ఏర్పడిన పండు తింటే ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం కూడా ఉంటుందట. అందుకే ఇక పుచ్చకాయను ఎక్కువ రోజులు నిలువ ఉంచకుండా త్వరగా తినేయడం మంచిది అని చెబుతున్నారు నిపుణులు.

## రాత్రి భోజనం తర్వాత స్వీట్స్ తింటున్నారా....?



రాత్రి భోజనం చేసిన తర్వాత ఏదైనా స్వీట్ తినడం మనలో చాలామందికి అలవాటు. కొంతమంది స్వీట్స్ తినకుండా అస్సలు ఉండలేరు. కానీ రాత్రి భోజనం తర్వాత స్వీట్లు తినడం వల్ల ఆరోగ్యానికి చాలా హానికరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు.రాత్రి స్వీట్లు తినడం వల్ల శరీరానికి అనేక విధాలుగా హాని కలుగుతుందంటున్నారు.

బరువు పెరగడం..రాత్రి భోజనం తర్వాత తీపి వంటకాలు తినడం వల్ల బరువు పెరుగుతారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. స్వీట్స్ శరీరంలోని ఇన్సులిన్ స్థాయిని పెంచుతాయి. దీని వల్ల మానవ శరీరంలో కొవ్వు పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. అందుకే రాత్రి భోజనం తర్వాత స్వీట్లకు దూరంగా ఉండాలంటున్నారు డైటీషియన్లు.జీర్ణ వ్యవస్థ చెడు ప్రభావం..బరువు పెరగడమే కాకుండా రాత్రి భోజనం తర్వాత స్వీట్లు తినడం వల్ల మీ జీర్ణ వ్యవస్థ పై చెడు ప్రభావం ఉంటుందంటున్నారు. ఇది మనిషి జీర్ణశక్తిని పాడు చేస్తుంది. జీర్ణ వ్యవస్థ మన శరీరంలోని రక్త ప్రసరణను నియంత్రిస్తుంది.గుండె మీద ప్రభావం..రాత్రిపూట నిరంతరం స్వీట్స్ తీసుకోవడం వల్ల మీ గుండె పై కూడా ప్రభావం చూపుతుంది. ఎక్కువ చక్కెర పానీయాలు తాగడం వల్ల బరువు పెరుగుతారు. ఇది అధిక రక్తపోటు, గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది.నిద్ర చెదిరిపోతుంది.. రాత్రిపూట స్వీట్లు తినడం వల్ల శరీరంలో ఎనర్జీ లెవెల్ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.


## మొలకెత్తిన శనగల్ని తినడం వల్ల ఈ సమస్యలన్నీ పరార్..!



పూర్వపు రోజుల నుంచి ఇప్పటి వరకు పప్పు ధాన్యాలకు ప్రత్యేకమైన స్థానం ఉన్నది.. ఇందు లో ముఖ్యంగా శనగలు ఆరోగ్యానికి చాలా మంచి చేస్తాయి.. నల్ల శనగలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయి..అయితే శనగలను నానబెట్టి మరి ఉడికించిన తర్వాత తినడం వల్ల ఇందులో ఉండేటువంటి మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలతో పాటు విటమిన్స్, మాంగనీస్, మినరల్స్ వంటివి పుష్కలంగా లభిస్తాయి.. అందుకే ఈ శనగలను తినడం వల్ల చాలా లాభాలను కలిగి ఉన్నాయి.షుగర్ ఉన్నవారికి మొలకెత్తిన శనగలు తినడం వల్ల ఇందులో ఉండే ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు గ్లైసోమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది.. దీంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ కూడా కంట్రోల్ లో ఉంచేలా చేస్తాయి. ఇమ్యూనిటీని పెంచడానికి ఈ మొలకెత్తిన శనగలు ఉపయోగపడతాయి.. వీటిని తీసుకోవడం వల్ల ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ పెద్ద ప్రేమ ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదాన్ని సైతం తగ్గిస్తాయి.చర్మ సమస్యలతో ఇబ్బంది పడే వారికి ఈ మొలకెత్తిన శనగలు చాలా ఉపయోగపడతాయి.. ఇందులో మాంగనీసం ఉండడం వల్ల ముడతలు వృద్ధాప్య లక్షణాలు కూడా దూరం చేస్తాయి.

## వాయు కాలుష్యం.. ఆత్మహత్యలకు లింక్ ఉందా?

ఇటీవల చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చిన్న చిన్న సమస్యలకు సైతం భయపడిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇదోక ఫ్యాషన్ అయిపోయింది. తాజాగా ఆత్మహత్యలకు వాతావరణ కాలుష్యం కూడా ఒక కారణం అంటూ వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఒక సర్వే వాతావరణ కాలుష్యానికి, ఆత్మహత్యలకు లింక్ ఉందని తేల్చి చెప్పింది. వాయు కాలుష్య స్థాయిలు ఆత్మహత్య రేటు తో ముడిపడి ఉన్నాయని ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది.చైనాలో మహిళలు తీవ్ర సమస్యలతో సతమతమవుతున్నారని గతంలో జరిగిన అధ్యయనాల్లో వెల్లడైంది. అయితే చైనాలో ఐదేళ్లు గా వాయు కాలుష్యం తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు.సర్వేల ప్రకారం వాయు కాలుష్యం తగ్గడం ద్వారా కొన్ని వేల ఆత్మహత్యలు నిరోధించినట్టుగా పరిశోధకులు తెలిపారు. అయితే ఇదే న్యూస్ తాజాగా ఇండియాలో కూడా పలు నగరాల్లో వాయు కాలుష్యం తీవ్రంగానే ఉంది. మన చుట్టూ ఉండే వాతావరణాన్ని బట్టి మన ఆలోచనలు ఉంటాయి.ఆహ్లాదకరమైన వాతవరణంలో ఆహ్లాదకరమైన జీవితం ఉంటుంది.కానీ వాతావరణం కాలుష్యమైతే మనిషిపై తీవ్రమైన అనారోగ్య ప్రభావాలను చూపుతాయి.వాయు కాలుష్యం అనేక ఆరోగ్య వ్యాధులతో




ముడిపడి ఉంది. చెడు గాలి వలన శ్వాసకోశ సమస్యలు, ఉబ్బసం, ఊపిరితిత్తుల మానసిక అనారోగ్య సమస్యలు వస్తాయి. నేచర్ సస్టైనబిలిటీ జర్నల్ అధ్యయనం ప్రకారం గాలి కాలుష్యం, ఆత్మహత్య రేటును ప్రభావితం చేసే కారకాల పరిస్థితుల పై ప్రభావం చూపుతోంది. అయితే గాలి నాణ్యత మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడంలో కీలక అంశంగా పనిచేస్తుందని వారు కనుగొన్నారు.నిజం చెప్పాలంటే మన చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం ఆరోగ్యం పై ఉంటుంది. దీర్ఘకాలిక ఆరోగ్య వ్యాధులకు దారితీసే నాడీ ప్రభావాలపై వాయు కాలుష్యం నేరుగా ప్రభావం చూపుతుందని సర్వేలో తేలింది. దీంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## రాగులతో చేసిన పదార్థాలు తింటున్నారా!




సమ్మర్ పూర్తిగా రాకముందే ఎండలు భగ్గుమంటున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఈ ఏడాది మార్చిలోనే భానుడి భగభగలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉక్కపోతతో పాటు వడదెబ్బతో బాధపడుతున్నారు. ఈ ఎండ కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోవడం కూడా సంభవిస్తుంది. ముఖ్యంగా ఊబకాయం, హైబీపీ, డీహైడ్రేషన్, వంటి సమస్యలు ఉన్నవారికి ఈ ఎండ వల్ల ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో చాలామంది శరీరాన్ని చల్లపరుచుకునేందుకు పలు పానీయాలను సేవిస్తుంటారు. ముఖ్యంగా చాలా మంది రాగి జావ ఆరోగ్యానికి మంచిదని ప్రాధాన్యతను ఇస్తుంటారు. అయితే రాగి జావ లోని పోషకాలు ఆరోగ్యానికి ప్రయోజనాలను కలిగిస్తాయని అందరికీ తెలిసిన విషయమే. ఇందులో ప్రోటీన్స్, ఫైబర్, కాల్షియం, పొటాషియం, పుష్కలంగా ఉండి మంచి ఫలితాలను అందిస్తాయి. అయితే రాగులతో చేసిన పదార్థాల వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఈ అనారోగ్య సమస్యలు ఉన్నవారు తీసుకోవడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.లిమూత్రపిండాల్లో రాళ్ల తో బాధపడేవారు రాగులను తినకూడదు. ఇది శరీరంలో ఆక్సాలిక్ యాసిడ్‌ను పెంచి సమస్యను తీవ్రతరం చేస్తుంది.అలాగే థైరాయిడ్ వ్యాధితో బాధపడేవారు రాగులతో చేసినవి తినడం హానికరం.

## తిన్న తర్వాత కడుపు ఉబ్బుతుందా...!



పొట్టను ఆరోగ్యంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా సురక్షితంగా ఉండొచ్చంటున్నారు వైద్యనిపుణులు. చాలా రోగాలకు కడుపులో కలిగే సమస్యలే కారణం అన్నది కూడా నిజం.క్రమరహిత ఆఖహారపు అలవాట్లు, అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా పొట్ట సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. గ్యాస్, మలబద్ధకం, ఉబ్బరం ఇవన్నీ సాధారణ పొట్ట సమస్యలు. అయితే చాలామందికి పొట్టలో సమస్యల కారణంగా ఆహారం తినగానే పొట్ట ఉబ్బినట్లు, నిండినట్లు అనిపిస్తుంది. ఈ సమస్య పై సీనియర్ డైటీషియన్ మాట్లాడుతూ ఆహారం, ఒత్తిడి, హార్మోన్ల ఇంబ్యాలెన్స్ గ్యాస్ ఉత్పత్తికి కారణమవుతాయని చెప్పారు. తరచుగా గ్యాస్, ఉబ్బరం సమస్యతో ఇబ్బంది పడుతుంటే ఇంటి చిట్కాలతోనే నివారించవచ్చంటున్నారు నిపుణులు. మరి ఆ చిట్కాలేంటో చూద్దామా. జీలకర్ర.. జీలకర్రను మెత్తగా రుబ్బి, దానిలో నల్ల ఉప్పు కలపాలి. భోజనం చేసిన తర్వాత ఆ మిశ్రమాన్ని కేవలం ఒక సిప్ నీటితో మింగాలి. దీనితో పాటు ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం తగ్గించాలని చెబుతున్నారు. దాల్చిన చెక్క, పసుపు, నిమ్మకాయ.. దాల్చిన చెక్క, పసుపు, నిమ్మకాయ నీరు ఉబ్బరం సమస్యను తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ఇది మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ పానీయం బెల్లీ ఫ్యాట్‌ని తగ్గిస్తుంది. ఉబ్బరం సమస్య నుండి కూడా ఉపశమనం కలిగిస్తుంది. రోజూ పుదీనా టీ లేదా గ్రీన్ టీ తీసుకోవడం వల్ల కూడా కడుపు ఉబ్బరం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. కడుపు ఉబ్బరం లేదా అపానవాయువు సమస్య ఉంటే నిపుణులు సూచించిన ఈ ఇంటి నివారణలను అనుసరించవచ్చు. జీలకర్ర.. జీలకర్రను మెత్తగా రుబ్బి, దానిలో నల్ల ఉప్పు కలపాలి. భోజనం చేసిన తర్వాత ఆ మిశ్రమాన్ని కేవలం ఒక సిప్ నీటితో మింగాలి. దీనితో పాటు ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం తగ్గించాలని చెబుతున్నారు.

## ముక్కుతోనే ఎందుకు ఊపిరి పీల్చుకోవాలి?



సాధారణంగా మనిషి చేసే చర్యలను బట్టి తాను ఆరోగ్యంగా ఉన్నాడా లేదా అన్న విషయాలను తెలుసుకోవచ్చు. అలాగే ఊపిరి పీల్చుకునే విధానాన్ని బట్టి కూడా ఆరోగ్యంగా ఉన్నారా లేదా అనారోగ్యంగా ఉన్నారా తెలుసుకోవచ్చు.సాధారణంగా ప్రతిఒక్కరూ ముక్కు ద్వారా శ్వాస తీసుకుంటారు. అప్పుడప్పుడు కొంతమంది నోటి ద్వారా కూడా శ్వాస తీసుకునేవారు ఉన్నారు. అయితే ఇటీవలి పరిశోధనలో తెలిపిన అధ్యయనాల్లో 61 శాతం మంది ప్రజలు నోటి ద్వారా శ్వాస తీసుకుంటారని తెలిపారు. నోటి ద్వారా శ్వాస తీసుకోవడం సాధారణమే అయినప్పటికీ ముక్కు ద్వారా శ్వాస తీసుకోవాలని పెద్దలు, ఆరోగ్య నిపుణులు చెప్పడం చాలా సార్లు వినే ఉంటాం. మరి ఈ విషయాల పై అధ్యయనాలు ఎలాంటి నిజాలను బయటపెడుతున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. శ్వాసకోశ వ్యవస్థ ముక్కు, నోటి నుండి మొదలవుతుంది. ఇది శ్వాసనాళాల ద్వారా, ఊపిరితిత్తుల ద్వారా కలుస్తుంది. ఇది శరీరంలో ఆక్సిజన్ ప్రవాహాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది. ముక్కు, నోరు శ్వాస తీసుకోవడానికి రెండు మార్గాలుగా ఉపయోగపడతాయి. అయితే ముక్కు ద్వారా శ్వాస తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ, రెగ్యులేటరీ, ఇంటిగ్రేటెడ్, కంపారిటివ్ ఫిజియాలజీలో ప్రచురించిన ఒక పరిశోధన ప్రకారం శ్వాస విధానం అనేది రక్తపోటు, హృదయ స్పందన రేటును ప్రభావితం చేస్తుందని వెల్లడైంది. నోటి ద్వారా కాకుండా ముక్కు ద్వారా శ్వాస తీసుకుంటే రక్తపోటు అదుపులో ఉండి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని ఈ పరిశోధనలో తేలింది. ఈ అధ్యయనం చేసేందుకు 20 మంది ఆరోగ్యవంతులైన యువకులను తీసుకున్నారు. వారు విశ్రాంతి తీసుకునేటప్పుడు, వ్యాయామం చేసేటప్పుడు వారి ముక్కు లేదా నోటి ద్వారా మాత్రమే శ్వాస తీసుకోవాలని తెలిపారు. ఈ పరిశోధనలో ప్రతి సెషన్‌లో ప్రజల రక్తపోటు, రక్తంలో ఆక్సిజన్ స్థాయి, హృదయ స్పందన రేటును కొలిచారు. ప్రజలు విశ్రాంతి తీసుకునేటప్పుడు వారి ముక్కు ద్వారా ఊపిరి పీల్చుకుంటే వారి రక్తపోటు తక్కువగా ఉండి, హృదయ స్పందన రేటు కూడా మెరుగుపడుతుందని తెలిసిందన్నారు. విశ్రాంతి సమయంలో ముక్కు ద్వారా శ్వాస తీసుకునేటప్పుడు నాడీ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. ఎక్కువగా ప్రజలు ఏదైనా బరువులు ఎత్తినప్పుడు, మెట్లు ఎక్కినప్పుడు, పరిగెత్తినప్పుడు లేదా వ్యాయామం చేసినప్పుడు నోటి ద్వారా శ్వాస తీసుకోవడం ప్రారంభిస్తారు. ఎందుకంటే ఆ సమయంలో గుండె చప్పుడు వేగంగా మారుతుంది. అందువల్ల నోటి ద్వారా శ్వాస తీసుకోవడం చాలా సాధారణం. కానీ వర్కవుట్స్ చేసేటప్పుడు కూడా ముక్కు ద్వారా మాత్రమే శ్వాస తీసుకోవాలని చెబుతారు. వ్యాయామం చేసేటప్పుడు ముక్కు లేదా నోటి ద్వారా శ్వాస తీసుకోవడంలో తేడా ఉండదని అధ్యయనాలు చెబుతున్నాయి. ముక్కు, నోరు శ్వాస తీసుకోవడానికి రెండు మార్గాలుగా ఉపయోగపడతాయి. అయితే ముక్కు ద్వారా శ్వాస తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు.



# 'మాస్ వేణుమా మాస్.. క్లాస్ వేణుమా క్లాస్'..

రామ్ చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా గురించి మెగా ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ గురించి ఏ చిన్న అప్‌డేట్ వచ్చిన అది ట్రెండింగ్‌లో ఉంటుంది. తాజాగా ఈ సినిమాలో రామ్ చరణ్ క్యారెక్టర్ గురించి ఓ చిన్న లీక్ బయటికి వచ్చింది. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'గేమ్ ఛేంజర్' ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఈ చిత్రాన్ని చాలా ఏళ్లుగా డైరెక్టర్ శంకర్ చెక్కుతూనే ఉన్నారు. ఈ మూవీలో కియారా అద్వాణి హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాకి ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాపై, అలానే రామ్ చరణ్ పాత్ర గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.
ఏది కావాలంటే అది.... రామ్ చరణ్ ఈ చిత్రంలో మాస్ పాత్రలో కనిపిస్తారా లేదా క్లాస్ రోల్‌లో కనిపిస్తారా అని అడిగిన ప్రశ్నకి బుర్రా ఆసక్తికర ఆన్సర్ ఇచ్చారు. "రామ్ చరణ్ క్యారెక్టర్‌కి సినిమాలో మల్టిపుల్ వేరియేషన్స్ ఉంటాయి. మాస్, క్లాస్, రగ్గడ్, డిగ్నిఫైడ్.. ఇలా మీరు ఏది కోరుకుంటే అది ఆ పాత్రలో కనిపిస్తుంది. ఎందుకంటే చరణ్‌లో ఆ షేడ్స్ అన్నీ మీకు కనిపిస్తాయి. ఒక సామాన్యుడు తన జీవితంలో వివిధ సందర్భాల్లో వివిధ రకాలుగా ప్రవర్తిస్తాడు కదా.. అలానే గేమ్ ఛేంజర్‌లో కథానాయకుడి పాత్రను రూపొందించారు." అంటూ సాయి మాధవ్ చెప్పారు. ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో ఎస్ జే సూర్య, శ్రీకాంత్, జయరామ్, నవీన్ చంద్ర, అంజలి, సునీల్, శుభలేక సుధాకర్ వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ఎస్ థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. నెక్స్ట్ ప్రాజెక్ట్ఇక గేమ్ ఛేంజర్‌తో పాటు రామ్ చరణ్ చేతిలో 16 మూవీ ఉంది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తుందనే టాక్ ఉంది. ఇక 16ను మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తుండగా సుకుమార్ రైటింగ్స్ కో ప్రొడ్యూసింగ్ చేయబోతుంది. ఇక ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకి మ్యూజిక్ అందిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో బిగ్‌బాస్ ఫేమ్, సీరియల్ నటుడు అర్జున్ అంబటి కూడా ఓ రోల్‌లో కనిపించబోతున్నాడు. ఇటీవల బిగ్‌బాస్ 7 వేదికపై అర్జున్‌కి ఈ అవకాశాన్ని ఇచ్చారు బుచ్చి బాబు. అయితే అర్జున్ ఏ పాత్రలో కనిపించబోతున్నా డో మాత్రం చెప్పలేదు. ఇక ఈ సినిమా ఉత్తరాంధ్ర బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతు న్నట్లు తెలుస్తోంది. అందుకోసమే ఉత్తరాంధ్ర యాసలో మాట్లాడగలిగే నటీనటుల కోసం ఆడిషన్ కూడా నిర్వహిస్తుంది మూవీ టీమ్.



# అయాన్ పాట మీద షారుఖ్..





లుట్ పుట్ గయా పాటను పాడి అయాన్ మరోసారి నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అయ్యాడు. ఆ వీడియో ఏకంగా షారుఖ్ వరకు చేరుకుంది. షారుఖ్ తన ట్విట్టర్‌లో అయాన్ పాడిన ఈ పాటను షేర్ చేశాడు. ఈ పాటను పాడిన తీరుకు ఫిదా అయ్యాడు. ఇకపై తన పిల్లలను శ్రీవల్లి పాట పాడేలా ప్రాక్టీస్ చేయిస్తానని అన్నాడు. దానిపై బన్నీ స్పందించాడు.
అల్లు అయాన్ రేంజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సోషల్ మీడియాలో ఏ మీమ్, ఏ ట్రోల్ చూసినా అయాన్ హవానే కనిపిస్తుంటుంది. అన్ని రకాలుగా ఓ వీడియోను ఫన్నీగా ట్రోల్ చేయొచ్చా? అని అయాన్ వీడియోలను చూస్తే తెలుస్తుంది.అయాన్ ఎప్పుడూ సందడి తిరుగుతూ ఉంటాడు. తనకు నచ్చినట్టుగా ఉంటాడు.అల్లు అర్జున్ కొడుకు, స్టార్ కిడ్ అన్న బంధనాల మధ్య అయాన్ కనిపించడు. చాలా ఫ్రీగా తనకు నచ్చినట్టుగా ఉంటాడు. అలా అయాన్ బయట ఈవెంట్లు, ఫంక్షన్లలో చేసే అల్లరికి సంబంధించిన వీడియోలు ఎప్పుడూ వైరల్ అవుతుంటాయి.
తాజాగా అయాన్ పాడిన ఓ పాట నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అయింది. లుట్ పుట్ గయా అంటూ సరదాగా అలా హమ్ చేశాడు అయాన్. దీంతో ఒక్కసారిగా మీడియాలో వైరల్ అయింది. చివరకు ఇది ఏకంగా బాలీవుడ్ బాద్ షా కంట్లో పడింది. షారుఖ్ ఈ అయాన్ వీడియోని చూశాడు. లుట్ పుట్ గాయ అంటూ తన డంకీ సినిమాలోని పాటను పాడటంతో కింగ్ ఖాన్ ఫిదా అయ్యాడు. ఇక అయాన్ మీద, అల్లు అర్జున్ మీద షారుఖ్ ప్రేమను కురిపించాడు.
థాంక్యూ లిటిల్ వన్.. నువ్వు ఫ్లవర్, ఫైర్ కలయికలా ఉన్నావ్.. అల్లు అర్జున్ శ్రీవల్లి పాటను నా పిల్లల చేత ప్రాక్టీస్ చేయిస్తా.. హహ అని ట్వీట్ వేశాడు. ఇక షారుఖ్ ట్వీట్ మీద బన్నీ స్పందించాడు. షారుఖ్ జీ.. సో స్వీట్ ఆఫ్ యూ.. మీ మెసెజ్ చూసి ఎంతో ఆనందం వేసింది.. అంటూ రిప్లై ఇచ్చాడు.అది అయాన్ రేంజ్ అని, సరదా సరదాకే అలా పాటను పాడేస్తే.. షారుఖ్ రిప్లై ఇచ్చే రేంజ్ అయాన్‌ది అంటూ ఫన్నీగా ట్రోల్స్, మీమ్స్ పడుతున్నాయి. అయాన్ మోడల్ బోల్తే అంటూ మళ్లీ ట్రెండ్ చేస్తున్నారు. ఏది ఏమైనా అయాన్ సైతం ఇప్పుడు నేషనల్ వైడ్‌గా లుట్ పుట్ గయాతో వైరల్ అవుతున్నాడు.

# ఎక్కడికెళ్లినా వాళ్ళు ఉండాల్సిందే..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చాలాకాలంగా బిగ్ బడ్జెట్ సినిమాలతో చాలా బిజీగా ఉన్నాడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చాలాకాలంగా బిగ్ బడ్జెట్ సినిమాలతో చాలా బిజీగా ఉన్నాడు. ఇక అప్పుడప్పుడు కాస్త రెస్ట్ తీసుకోవడానికి విదేశాలకు వెళుతూ ఉంటాడు. ప్రభాస్ ఒకప్పుడు ఈ రేంజ్ లో స్టార్ హోదా రాకముందు మాత్రం తన ఫామ్ హౌస్ లో ఎక్కువగా ఉండడానికి ఇష్టపడేవాడు. అయితే ప్రభాస్ కు ఒకే చోట ఉండాలన్నా కూడా అంతగా ఇష్టం ఉండదు. బయట కూడా తిరగాలని చాలా ఇంట్రెస్ట్ చూపిస్తూ ఉంటాడు. ఒకప్పుడు హైదరాబాద్లో బెస్ట్ ఫుడ్ ఏది ఉంటే అది ప్రభాస్ వెంటనే తినాలని అనుకునేవారు. చాలా ఇంటర్వ్యూలలో ఈ విషయాన్ని తెలియజేశాడు. ఆఖరికి లోకల్ పానీపూరి కూడా వదల్లేదు అని ఎన్నోసార్లు చెప్పాడు. అయితే ఇప్పటికి కూడా ప్రభాస్ అంతే సింపుల్ గా ఉండడానికి ఇష్టపడతాడు. కానీ బయట మాత్రం తిరిగే స్వేచ్ఛ ఉండదు కాబట్టి ఎక్కువగా విదేశాలకు వెళుతూ ఉన్నాడు. మోహన్ బాబు సంచలన లేఖ! అయితే అక్కడ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభాస్ ప్రత్యేకంగా ఒక ఇంటిని లేదా విల్లా లాంటివి రెంటుకు తీసుకుని ఉంటున్నట్లుగా తెలుస్తోంది. అందుకోసం ఖర్చు కూడా గట్టిగానే పెడుతున్నాడు. ఆ మధ్య ఇటలీలో కూడా ప్రభాస్ ఒక పెద్ద బంగ్లా తీసుకున్నాడు అని చాలా రకాల వార్తలు వచ్చాయి. సాహో సినిమా తర్వాత కొన్నాళ్ళు ప్రభాస్ అక్కడే రెస్ట్ తీసుకున్నాడు. అప్పుడప్పుడు యూఎస్ కూడా వెళ్లడం కామన్. ఇక రీసెంట్‌గా అతను లండన్ వెళ్లగా అక్కడ కూడా మరొక విల్లా ను రెంట్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఆ విల్లా రెంట్ దాదాపు 60 లక్షలు అని తెలుస్తోంది. ఇక ప్రభాస్ తో పాటు అతని టీం కూడా ఎల్లప్పుడూ విదేశాలకు వెళ్లడం కామన్ గా మారిపోయింది. ముఖ్యంగా ప్రభాస్ కోసం ప్రత్యేకంగా ఒక చెఫ్ కూడా ఎల్లప్పుడూ అతని వెంటే ప్రయాణాలు చేస్తూ ఉంటాడు. అతని మేనేజర్స్ కూడా ప్రభాస్ తో పాటు విదేశాలకు వెళ్లాల్సిందే. ఇక ప్రభాస్ మంచి భోజనం ప్రియుడు కాబట్టి ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న చెఫ్ ఏ దేశం వెళ్లినా వెంట ఉండాల్సిందే. అతనికి ఇష్టమైన రకరకాల వంటలను తనే చేయడం, లేదంటే అక్కడ ఉన్న బెస్ట్ చెఫ్ లను పిలిపించి వండిం చడం లాంటివి చేస్తూ ఉంటారు. ఇక వారి కోస ం కూడా ఖర్చు గట్టిగానే చేస్తు న్న ప్రభాస్ మొత్తంగా విదేశా లకు హాలిడేస్ కోస ం వెళితే మాత్రం కోట్లల్లో ఖర్చు చేసే అవకాశం ఉన్నట్లుగా తెలు స్తోంది. ఏదేమైనా ప్రభాస్ వెళితే అసిస్టెంట్లకు కూడా ఒక హాలి డే వేకేషన్ లాంటిదే అని చెప్పవచ్చు. ఒకవేళ వేరే వారు పనిలో చేరినా ప్రభాస్ మంచితనంకు ఫ్రెండ్స్ అయిపోతారు. ఎందుకంటే మన చుట్టూ ఉన్నవారు బాగుంటేనే మనం బాగుంటాము అని ప్రభాస్ నమ్ముతారు.

# ఆ ఒక్కపదంతో దొరికిపోయిందే..

రష్మిక ఈ మధ్య యానిమల్‌తో సక్సెస్ కొట్టింది. కానీ యానిమల్ సక్సెస్ పార్టీ, సక్సెస్ మీట్‌లో మాత్రం ఎక్కడా కనిపించలేదు. దీంతో రష్మిక మీద రకరకాల రూమర్లు వచ్చాయి. యానిమల్ సక్సెస్‌లో పాలు పంచుకోకపోవడంపై రష్మిక క్లారిటీ ఇచ్చింది. రష్మిక ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉంది. యానిమల్ మూవీ రిలీజ్ అయిన తరువాత వెంటనే మళ్లీ గర్ల్ ఫ్రెండ్ అనే ఓ లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌ను ఓకే చేసింది. బాలీవుడ్, టాలీవుడ్ చిత్రాలతో రష్మిక బిజీగానే ఉంటోంది.అయితే యానిమల్ మూవీ సక్సెస్ మీట్ గానీ, సక్సెస్ పార్టీలో గానీ రష్మిక కనిపించలేదు. దీంతో రష్మికకు, యానిమల్ టీంకు మధ్య గొడవలు జరిగాయని, గ్యాప్ వచ్చిందని రూమర్లు వైరల్ అయ్యాయి. ఈ రూమర్లు కాస్త రష్మిక వద్దకు చేరినట్టుగా ఉన్నాయి. దీంతో రష్మిక ఇలా స్పందించింది. షూట్ గ్యాప్‌లో ఇలా ఫోటోలు షేర్ చేస్తూ తన వాదన వినిపించింది. షూటింగ్ గ్యాప్‌లో రష్మిక ఇలా కాస్త టైం తీసుకుంది. తన లుక్ రివీల్ కాకుండా ఫోటోను షేర్ చేసింది. ఇప్పుడు కొత్త సినిమాకు సంబంధించిన షూటింగ్‌లో ఉన్నాను.. అందుకే లుక్ రివీల్ కాకుండా ఇలా అడ్డు పెట్టి ఫోటోలను షేర్ చేస్తున్నాను అని రష్మిక తెలిపింది. అయితే యానిమల్ సినిమా సక్సెస్ మీట్‌లో తాను కనిపించడం లేదని, ఆ సక్సెస్‌లో భాగస్వామ్యం తీసుకోవడం లేదని అనుకోకండి.. ఇలా వెంటనే సినిమా షూటింగ్‌లు ఉండటంతో బిజీగా గడపాల్సి వస్తుందని క్లారిటీ ఇచ్చింది. ఇక రష్మిక ఇలా వేసిన పోస్ట్ మీద నెటిజన్ స్పందించాడు. ఇలా ఎలాగో కాస్త గ్యాప్ తీసుకున్నావ్.. ఆ గ్యాప్‌లో నాకు రిప్లై ఇవ్వొచ్చు కదా? అని అడిగేశాడు. దానికి రష్మిక ఇలా ఫన్నీగా స్పందించింది. గ్యాప్‌లో అంట.. వర్క్ గ్యాప్‌లో ఈ ఫోటో తీసుకున్నాన్ రా.. సెల్ఫీ తీసుకు న్నప్పుడు గ్యాప్ లేకుండే అని ట్వీట్ వేసింది. ఇక ఈ ట్వీట్‌ను చాలా లోతుగా పరిశీలించిన కొంత మంది నెటిజన్లు.. ఇది రష్మిక స్లాంగ్ కాదని, రష్మిక స్లాంగ్ మీద విజయ్ దేవరకొండ ప్రభావం ఉందని, లేకుండే అని పదాన్ని విజయ్ మాత్రమే ఎక్కువగా వాడుతాడని, విజయ్ స్లాంగ్ అనేది రష్మిక మీద చాలానే ప్రభావం చూపిం చిందని కామెంట్లు చేస్తున్నారు. వీరిద్దరూ ఒక్కటే అని మళ్లీ రూమర్లు క్రియేట్ చేస్తున్నారు. కానీ తామిద్దరం బెస్ట్ ఫ్రెండ్స్ అని విజయ్, రష్మిక చెబుతుంటారు. వీరిద్దరి విషయంలో ఏం జరుగుతుం దనేది కాలమే చెప్పాలి.



# నయన్-విఘ్నేష్ సింగపూర్‌లో జాలీ ట్రిప్

ఆ ఇద్దరూ టీ-షర్టులు జీన్స్ ధరించి చాలా క్యాజువల్ గా కనిపించారు. నయన్ తాను షేర్ చేసిన ఫోటోలకు 'ఖో గయే హమ్ కహాన్' పాటను నేపథ్య స్కోర్‌గా ఉపయోగించారు. నయనతార- విఘ్నేష్ శివన్ సింగపూర్‌లో వేకేషన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఈ జంట రొమాంటిక్ బ్లాక్ అండ్ వైట్ ఫోటో తాజాగా విడుదలై వైరల్ గా మారింది. ఈ ఫోటోలో విఘ్నేష్ తన సతీమణి నయనతార మెడ చుట్టూ చేతులు వేసి తనను వెనుక నుండి కౌగిలించుకోవడం హైలైట్ అయింది. ఆ ఇద్దరూ టీ-షర్టులు జీన్స్ ధరించి చాలా క్యాజువల్ గా కనిపించారు. నయన్ తాను షేర్ చేసిన ఫోటోలకు 'ఖో గయే హమ్ కహాన్' పాటను నేపథ్య స్కోర్‌గా ఉపయోగించారు. విఘ్నేష్ తన ఇన్‌స్టా ఖాతాలో సింగపూర్‌లోని నైట్ వైబ్స్ నుంచి కొన్ని వీడియోలు ఫోటోలను షేర్ చేసారు. ఈ అందమైన జంటకు వివాహమై రెండేళ్లవుతోంది. వారికి ఉయిర్-ఉలగ్ అనే ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. వేకేషన్ లో తమ కిడ్స్ తో కలిసి ఈ జంట విలువైన సమయాన్ని ఆస్వాధిస్తున్నారు. అయినా దంపతులు కేవలం రొమాంటిక్ డేట్ కి సంబంధించిన ఫోటోలను మాత్రమే షేర్ చేసారు. ప్రస్తుతం ఈ రొమాంటిక్ డేట్ కి సంబంధించిన ఫోటోలు నెటిజనుల్లో వైరల్ అవుతున్నాయి. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ 2024లో షారూఖ్ ఖాన్, కరీనా, నయనతార మెరుపులు మెరిపించిన సంగతి తెలిసిందే. నయనతార 'జవాన్' చిత్రానికి ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. విఘ్నేష్ శివన్ తన తదుపరి దర్శకత్వ వెంచర్ 'లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్' చిత్రం కోసం పని చేస్తున్నాడు. ఇందులో ప్రదీప్ రంగనాథన్, సూర్య, కృతి శెట్టి ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. నయనతార చివరిగా 'అన్నపూర్ణి: ది గాడెస్ ఆఫ్ ఫుడ్' సిరీస్‌లో కనిపించింది. తదుపరి ఎస్. శశికాంత్ దర్శకత్వం వహించిన 'టెస్ట్'లో కనిపించనుంది. ఈ చిత్రంలో ఆర్. మాధవన్, సిద్ధార్థ్, మీరా జాస్మిన్ ప్రధాన పాత్రలు పోషించారు.



# చాల పెద్ద విషయం

ఈ సినిమా కోసం వరుణ్ ప్రత్యేకంగా ఎయిర్ పోర్స్ లో ట్రైనింగ్ తీసుకుని మరీ సన్నదం అయ్యాడు. పవర్ ఫుల్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా శక్తి ప్రతాప్ సింగ్ తెరకెక్కిస్తోన్న 'ఆపరేషన్ వాలంటైన్' గురించి చెప్పాల్సిన పనిలేదు. మెగా ప్రిన్స్ చేస్తోన్న మరో భారీ సాహసం ఇది. ఎయిర్ పోర్స్ నేపథ్యంలో పుల్వామా ఎటాక్స్ ఆధారంగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వాస్తవ సంఘటనలు ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాకి మంచి బజ్‌ని తీసుకొచ్చాయి. ఈ డైరెక్టర్ కూడా సైలెంటుగానే.. ఈ సినిమా కోసం వరుణ్ ప్రత్యేకంగా ఎయిర్ పోర్స్ లో ట్రైనింగ్ తీసుకుని మరీ సన్నదం అయ్యాడు. పవర్ ఫుల్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. వరుణ్ లుక్ ..క్యారెక్టరైజేషన్ ప్రతీది హైలైట్ చేస్తుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్ లో సైతం మెగాస్టార్ చిరంజీవి బూస్టింగ్ తో వరుణ్ మరింత బలంగా జనాల్లోకి వెళ్తు న్నాడు. మెగా క్యాంప్ లోనే ప్రత్యేకమైన హీరోగా హైలైట్ అవుతున్నాడు. సాధారణంగా ఇలాంటి సినిమాల షూటింగ్ పూర్తి చేయడం అన్నది అంత సులభం కాదు.కొన్ని నెలలు పాటు శ్రమిస్తే తప్ప సాధ్యంకానిది. నటీనటులందరిపై ప్రత్యేకగా దృష్టి పెడితే తప్ప పర్ఫెక్ష న్ రాదు. అందుకోసం చేసిన పనే మళ్లీ మళ్లీ చేయాల్సి వస్తుంది. అందుకోసమే హీరోల కాల్షీట్లు కూడా ఎక్కువగానే కేటాయించాల్సి వస్తుంది. అవసరం మేర రీషూట్లు కూడా చేస్తుంటారు. అయితే ఆపరేషన్ వాలంటైన్ మాత్రం 75 రోజుల్లోనే పూర్తి చేసినట్లు తెలిపారు. అంటే ఈ సినిమా షూటింగ్ చాలా వేగంగా పూర్తి చేసినట్లు లెక్క. ఇలాంటి సినిమాలకు కనీసం ఆరు నెలలైనా షూటిం గ కే సమయం పడుతుంది. కానీ శక్తి ప్రతాప్ సింగ్ ఆ ఛాన్స్ తీసుకోలేదు. బడ్జెట్ లోనే షూట్ అంతా వేగంగా పూర్తిచేసినట్ల తెలుస్తోంది. ఇలాంటి సినిమాలు బడ్జెట్‌లో పూర్తి చేయడం కూడా చిన్న విషయం కాదు. ఎంతో ప్లానింగ్ ఉంటో తప్ప పనికాదు. ఈ విషయంలో శక్తి ప్రతాప్ సింగ్ ఘాజీ దర్శకుడు సంకల్ప్ రెడ్డి వ్యూహాన్నే అనుసరించి ముందుకెళ్తినట్లు తెలుస్తోంది. 75 రోజుల షూట్ అనంతరం గ్రాఫిక్స్ సహా ఇతర పనులకే ఎక్కువ సమయం పట్టినట్లు తెలుస్తోంది.

# ఈ వెయిటింగ్ ఎందుకో..?



ఒక హిట్టు పడ్డాక కూడా సీనియర్ స్టార్ హీరో టాలీవుడ్ కింగ్ నాగార్జున ఎందుకో ఇంకా కథల వేట కొనసాగిస్తూనే ఉన్నారు ఒక హిట్టు పడ్డాక కూడా సీనియర్ స్టార్ హీరో టాలీవుడ్ కింగ్ నాగార్జున ఎందుకో ఇంకా కథల వేట కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రేక్షకులు తన నుంచి ఎలాంటి సినిమాలు ఆశిస్తున్నారో నా సామిరంగ హిట్ తర్వాత ఒక క్లారిటీ వచ్చేసినట్టు భావిస్తున్న నాగార్జున ఇక మీదట అలాంటి సినిమాలతోనే సంక్రాంతి సీజన్ కు వస్తామని ప్రకటించారు. అయితే అనౌన్స్ మెంట్ అయితే చేశారు కానీ నాగార్జున నెక్స్ట్ సినిమా గురించి ఎలాంటి అప్డేట్ రాలేదు. అఫ్కోర్స్ ధనుష్ లీడ్ రోల్ లో శేఖర్ కమ్ముల డైరెక్ట్ చేస్తున్న సినిమాలో నాగార్జున కూడా భాగం అవుతున్నారు. కానీ అది మల్టీస్టారర్ సినిమానే అవుతుంది తప్ప సోలో సినిమా కాదు. నాగార్జున సోలో సినిమా కోసం అక్కినేని ఫ్యాన్స్ ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. ఆమధ్య ఒకటి రెండు యాక్షన్ సినిమాలు చేసి బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టగా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్స్ తో సూపర్ హిట్ కొడుతున్నారు నాగార్జున. ప్రస్తుతం తన దగ్గరకు వచ్చిన కథలన్నిటినీ జల్లెడ పట్టి సెలెక్టెడ్ స్క్రిప్ట్ ని కూడా ఇంకాస్త మెరుగుపరిచి అప్పుడు సినిమా చేయాలని భావిస్తున్నారట నాగార్జున. నాగార్జున మైల్ స్టోన్ మూవీ 100వ సినిమా ఎవరి డైరెక్షన్ లో వస్తుంది అన్నది తెలియాల్సి ఉంది. ఆ మధ్య గాడ్ ఫాదర్ డైరెక్టర్ మోహన్ రాజాతో నాగార్జున సినిమా ఉంటుందని వార్తలు వచ్చాయి. నాగార్జున, అఖిల్ లతో కలిసి ఒక క్రేజీ మల్టీస్టారర్ చేస్తున్నారని అన్నారు. కానీ ఏమైందో ఏమో కానీ ఆ ప్రాజెక్ట్ గురించి తర్వాత ఎలాంటి అప్డేట్ రాలేదు. నాగార్జున మోహన్ రాజాతో రిస్క్ ఎందుకని ఆ సినిమా కాదనుకున్నారని టాక్. నా సామిరంగ ఇచ్చిన హిట్ కిక్ తో నాగార్జున ఇక మీదట కథల విషయంలో చాలా జాగ్రత్త పడుతున్నారని తెలుస్తుంది. ఆడియన్స్ కు ఒక మంచి సినిమా అందిస్తే ఎప్పుడు వారు దాన్ని హిట్ చేస్తారని నా సామిరంగ తో మరోసారి తెలుసుకున్న నాగార్జున ఇక మీదట అలాంటి సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యారని తెలుస్తుంది. నాగార్జున దగ్గరకు పదుల కొద్ది స్క్రిప్ట్స్ రాగా వాటిలో ఒక 3 ఫైనల్ చేసినట్టు తెలుస్తుంది.

# కవ్వించే చూపుల అందాల రాశి

అందాల ముద్దుగుమ్మ రాశి ఖన్నా టైట్ ఫిట్ డ్రస్‌లో బెడ్‌పై పడుకుని ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. ఒక వైపు స్లీవ్ లెస్ డ్రస్‌తో కవ్విస్తోం ది.ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఈ అమ్మడు చిన్న హీరోలకు జోడీగా నటించి మెప్పించింది. అయితే స్టార్ హీరోలకు మాత్రం వాంటెడ్ అవ్వలేక పోయింది. అందాల రాశి పేరుకు తగ్గట్లుగానే అందంగా కనిపించడం కోసం ఆ మధ్య చాలా బరువు తగ్గింది. తెలుగుతో పాటు తమిళం మరియు ఇతర భాషల్లో కూడా ఈ అమ్మడు నటిస్తూ మెప్పించింది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంది.

# మరోసారి అగ్ర హీరోకు ప్రశాంత్ నీల్ దెబ్బ!



ప్రశాంత్ నీల్ సలార్ తో క్లాష్ వల్లే షారుక్ సినిమాకి గట్టి దెబ్బ పడిందని స్పష్టంగా అర్థమవుతుంది. బాలీవుడ్ అగ్ర హీరో షారుఖ్ ఖాన్ గత ఏడాది పఠాన్, జవాన్ వంటి సినిమాల తో బ్యాక్ టు బ్యాక్ ఆల్ టైం బ్లాక్ బస్టర్స్ తో భారీ కం బ్యాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. అప్పటివరకు వరుస ఫ్లాప్స్ తో కంప్లీట్ డౌన్ ఫాల్ లో ఉన్న షారుక్ 'పఠాన్' తో బాక్స్ ఆఫీస్ దగ్గర వెయ్యి కోట్లు కొల్లగొట్టి తన సత్తా ఏంటో చాటాడు. ఆ తర్వాత వెంటనే జవాన్ తో మరో వెయ్యి కోట్ల బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. అలా బ్యాక్ టు బ్యాక్ రెండు ఆల్ టైం బ్లాక్ బస్టర్ డెలివరీ చేసిన షారుక్ తన తదుపరి చిత్రంగా రాజ్ కుమార్ హిరానీతో 'డంకీ' సినిమా చేశాడు. మొదటిసారి వీరి కాంబినేషన్ కలవడంతో ఈ ప్రాజెక్టుపై ముందు నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. కానీ రిలీజ్ తర్వాత ఈ సినిమా ప్రేక్షకుల్ని నిరాశపరిచింది. డంకీ కథ, కథనం పరంగా బాగానే ఉన్నా అదే సమయంలో వచ్చిన 'సలార్' తో పోటీ పడడం సినిమాకి పెద్ద మైనస్ గా మారింది. ముఖ్యంగా ప్రశాంత్ నీల్ సలార్ మూవీతో జరిగిన క్లాష్ వల్ల నార్త్ బెల్టులో 'డంకీ' బిజినెస్ కి భారీగా దెబ్బ పడింది. 'డంకీ' మూవీ ఇండియన్ నెట్ వర్త్ సుమారు 255 కోట్లు ఉన్నప్పటికీ.. సలార్ దాన్ని 150 కోట్లతో డామినేట్ చేసింది. అంతేకాకుండా వరల్డ్ వైడ్ గా చూసుకుంటే సలార్ ఫుల్ రన్ లో 600 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేస్తే, డంకీ 475 కోట్లతో సరిపెట్టుకుం ది. ప్రశాంత్ నీల్ సలార్ తో క్లాష్ వల్లే షారుక్ సినిమాకి గట్టి దెబ్బ పడిందని స్పష్టంగా అర్థమవుతుంది. ప్రశాంత్ నీల్ సినిమాలు షారుక్ సినిమాకి ఇబ్బందిగా మారడం ఇదే మొదటి సారి కాదు. 2018 లో కూడా 'కేజీఎఫ్ చాప్టర్ 1' షారుక్ ఖాన్ 'జీరో' మూవీతో పోటీ పడగా కేజీఎఫ్' హిందీలో ఏకంగా 45 కోట్లు వసూలు చేసి సూపర్ హిట్ అయితే 'జీరో' వరల్డ్ వైడ్ గా 90 కోట్లు కలెక్ట్ చేసి డిజాస్టర్ గా నిలిచింది. అయితే ఈ విషయంలో షారుక్ ఖాన్ ఫ్యాన్స్ జీరో, డంకి ఈ రెండు సినిమాలు డ్రా మా జానర్ కు చెందినవే అని వాదిస్తున్నారు. అదే పఠాన్, జవాన్ లాంటి భారీ స్థాయి యాక్షన్ సినిమాలతో ప్రశాంత్ నీల్ పోటీ పడ్డప్పుడు అసలు అగ్నిపరీక్ష మొదలవుతుందని అప్పుడే ఎవరి క్రేజ్ ఏంటో తెలుస్తుందని అంటున్నారు.

# విజయం తనకే దక్కాలనే ఉద్దేశంతో కట్టుకథలు



చాట్‌జీపీటీని రూపొందించిన సంస్థ ఓపెన్‌ఏఐ, దాని సీఈఓ శామ్ ఆల్ట్‌మన్‌పై టెస్లా అధినేత ఎలోన్‌మస్క్ ఇటీవల దావా వేసిన సంగతి తెలిసిందే. చాట్‌జీపీటీ రూపొందించే సమయంలో కుదిరిన ఒప్పందాలను ఉల్లంఘించిన కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎలోన్‌మస్క్ చెప్పారు. ఈ పరిణామాల వల్ల ఓపెన్‌ఏఐ, ఎలాన్ మస్క్ మధ్య వివాదం క్రమంగా ముదురిింది. ఈ నేపథ్యంలో ఓపెన్‌ఏఐ సంస్థ స్పందించింది. ఎలోన్ మస్క్ ఓపెన్‌ఏఐపై చేసిన అన్ని వ్యాఖ్యలు కట్టుకథని కొట్టిపారేసింది. మస్క్‌తో ఓపెన్‌ఏఐ ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని తెలిపింది. సంస్థకు చెందిన అన్ని విజయాలు తనకే దక్కాలనే ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నట్లు వివరించింది. ఆయన లేకుండా విజయం సాధించడాన్ని మస్క్ తట్టుకోలేకపోతున్నట్లు పేర్కొంది. ఓపెన్‌ఏఐని ప్రజా సంక్షేమం కోసం లాభాలను ఆశించకూడదనే భావనతో ఏర్పాటు చేశామని మస్క్ ఇటీవల తెలిపారు. కానీ, ఆ కంపెనీ ఇప్పుడు.. మైక్రోసాఫ్ట్ కింద పూర్తిగా లాభాల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. దీంతో తన లక్ష్యం విషయంలో రాజీ పడిందని, ఒప్పందాలను ఉల్లంఘించిందని పేర్కొంటూ శాన్‌ఫ్రాన్సిస్కో సుపీరియర్ కోర్టులో దావా వేశారు. ఈ వ్యవహారంపై ఓపెన్‌ఏఐ గతంలో మాట్లాడుతూ తమ కంపెనీని టెస్లాలో విలీనం చేయాలని మస్క్ ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపించింది. లేదంటే పూర్తి నియంత్రణను ఆయన చేతికి ఇవ్వమన్నారని పేర్కొంది. 2017లో లాభాపేక్ష సంస్థనే ఏర్పాటు చేయాలనుకున్నామని.. కానీ, బోర్డు నియంత్రణ, సీఈఓ పదవి తనకు కావాలని మస్క్ డిమాండ్ చేసినట్లు చెప్పింది. కానీ, తమ కంపెనీ వీటికి అంగీకరించలేదని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే ఆయన సంస్థ నుంచి వైదొలగారని చెప్పింది. వీటికి సంబంధించిన కొన్ని ఈమెయిళ్లను కంపెనీ ఇటీవలే బహిర్గతం చేసింది. 2022 నవంబరులో వచ్చిన చాట్‌జీపీటీ ఆరు నెలల్లోనే ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ సంపాదించుకున్న సంగతి తెలిసిందే. 2015లో ఓపెన్‌ఏఐను శామ్ ఆల్టమన్ బృందం స్థాపించినప్పుడు మస్క్ అందులో పెట్టుబడులు పెట్టారు. 2018లో సంస్థ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. 2022 అక్టోబరులో 44 బిలియన్ డాలర్లతో ట్విట్టర్ (ప్రస్తుతం ఎక్స్)ను కొనుగోలు చేశారు.

# ఎస్బీఐ నుంచి బెస్ట్ ఎఫ్‌డీ స్కీమ్స్ ఇవే.....!




సాధారణంగా మనందరికీ ఎక్కువగా తెలిసిన పొదుపు మార్గం ఫిక్స్ డ్ డిపాజిట్లు. వీటిలో సొమ్మును డిపాజిట్ (ఎఫ్ డీ) చేయడం ద్వారా నిర్ణీత కాలానికి వడ్డీతో కలిసి కొంత మొత్తం అందుతుంది.అయితే ఎఫ్ డీలపై అన్ని బ్యాంకులు ఒకే వడ్డీరేటు ఇవ్వవు. అందువల్లనే సురక్షితమైన బ్యాంకుతో పాటు, అధిక వడ్డీరేటు ఇచ్చే బ్యాంకులను ఎంచుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్ల లోని బ్యాంకులన్నీ ప్రజల నుంచి ఎఫ్ డీలను ఆహ్వానిస్తాయి. ఈ నేపథ్యంలో దేశంలోని అతి పెద్ద రుణదాత అయిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)లో ఎఫ్ డీ పథకాలు, వాటికి ఇస్తున్న వడ్డీరేట్లను తెలుసుకుందాం.. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్ బీఐ) నూతన ఫిక్స్ డ్ డిపాజిట్ (ఎఫ్డీ) పథకాన్ని ప్రారంభించింది. దాని పేరు అమృత్ కలాష్ స్పెషల్ ఎఫ్‌డీ. ఇందులో వేసిన డిపాజిట్లకు సాధారణ ఎఫ్‌డీలకు ఇచ్చే వడ్డీ కంటే ఎక్కువ వస్తుంది. సీనియర్ సిటిజన్లకు మంచి అవకాశం. ఈ పథకంలో పెట్టుబడి పెట్టుబడి పెట్టడానికి ప్రజలను ఆహ్వానిస్తోంది. ఈ గడువును అనేక సార్లు పొడిగించుకుంటూ వచ్చింది. ప్రస్తుతం మార్చి 31 వరకూ అవకాశం ఉంది. ఎస్ బీఐ ప్రవేశపెట్టిన ఈ పథకం సీనియర్ సిటీజన్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణ ఎఫ్ డీలపై వడ్డీ కంటే ఎక్కువగా ఇవ్వడం వీరికి ప్రయోజనం కలిగిస్తుంది. ఈ పథకంలో పెట్టుబడి పెట్టడానికి ఈనెలాఖరు వరకూ మాత్రమే గడువు ఉంది. సమీపంలోని ఆ బ్యాంకు శాఖలను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు. వడ్డీ రేటు ఇలా.. అమృత్ కలాష్ ఎఫ్ డీ పథకంలో డిపాజిట్లకు వడ్డీ రేటు అధికంగానే ఉంది. 400 రోజుల కాలవ్యవధికి చేసిన డిపాజిట్లపై సుమారు 7.10 శాతం వడ్డీని అందిస్తుంది. ఈ వడ్డీ రేటు ఎస్ బీఐ సాధారణ ఎఫ్ డీ రేటు కంటే ఎక్కువ. సీనియర్ సిటిజన్లు సంవత్సరానికి 7.60 శాతం వడ్డీని పొందుతారు. ఈ పథకంలో సీనియర్ సిటిజన్ల తో పాటు మామూలు ఖాతాదారులు కూడా పెట్టుబడి పెట్టవచ్చు.

# మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే.. ఈ తప్పులు అస్సలు చేయకండి



మహిళలు పురుషులతో సమానంగా ఎదుగుతున్నారు. ఆర్థిక నిర్వహణలో కూడా నైపుణ్యాన్ని కలిగి ఉంటున్నారు. ఈ క్రమంలో వారి ఆర్థిక నిర్వహణలో కూడా లోపాలు ఉండే అవకాశం ఉంది. పైగా ఆర్థిక పరమైన అంశాలను మహిళలు ఎక్కువగా బయట వ్యక్తులతో మాట్లాడరు. అందుకే వారి ఆర్థిక నిర్వహణలో లోపాలు బహిర్గతం అయ్యే అవకాశాలు తక్కువ. ఆర్థిక పరమైన అంశాల విషయానికి వచ్చే సరికి పురుషుల నిర్ణయాలు, వారు చేసే తప్పుల గురించే ఎక్కువ మాట్లాడుతారు. ఎందుకంటే ఎక్కువశాతం కుటుంబాలలో గానీ, వ్యాపారాలలో గానీ నిర్ణయాధికారం పురుషులదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఇది మారుతోంది. మహిళలు సాధికారత సాధిస్తున్నారు. వ్యాపారాల్లో రాణిస్తున్నారు. కుటుంబాల్లో నిర్ణయ శక్తిగా మారుతున్నారు. చాలా కంపెనీలకు సీఈఓలుగా మహిళలు ఉంటున్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఎదుగుతున్నారు. ఆర్థిక నిర్వహణలో కూడా నైపుణ్యాన్ని కలిగి ఉంటున్నారు. ఈ క్రమంలో వారి ఆర్థిక నిర్వహణలో కూడా లోపాలు ఉండే అవకాశం ఉంది. పైగా ఆర్థిక పరమైన అంశాలను మహిళలు ఎక్కువగా బయట వ్యక్తులతో మాట్లాడరు.

# టెస్లా కోసం ప్రత్యేకంగా పాలసీలు రూపొందించలేం : పీయూష్ గోయల్




అమెరికాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ టెస్లా కోసం భారత ప్రభుత్వం ప్రత్యేకంగా పాలసీలను రూపొందించబోదని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారులందరినీ ఆకర్షించేలా దేశంలో చట్టాలు, టారిఫ్ నిబంధనలను రూపొందిస్తామని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. బ్యాటరీతో నడిచే వాహనాలను ఎక్కువగా వినియోగించడం ద్వారా కార్బన ఉద్గారాలతో పాటు ముడి చమురు ధర బిల్లు తగ్గుతుందన్నారు. బలమైన ఈవీ ఎకోసిస్టమ్ అవసరాన్ని మోదీ ప్రభుత్వం అర్థం చేసుకుందని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం ఏ ఒక్క కంపెనీకి ఉపయోగపడేలా పాలసీలను తయారుచేయదన్నారు.

# చిన్న షేర్లలో అవకతవకలు.....!




**ముంబై :** చిన్న, మధ్యతరహా స్టాక్స్‌లో అవకతవకలు జరుగుతున్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి పేర్కొన్నారు. కొంతమంది అసహజ లావాదేవీలకు తెరతీసినట్లు గుర్తించామని తెలియజేశారు. చిన్న, మధ్యతరహా సంస్థల(ఎస్‌ఎంఈలు) విభాగంలో కృత్రిమంగా ధరల పెంపును చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎస్‌ఎంఈ విభాగం ఐపీవోలతోపాటు.. సెకండరీ మార్కెట్లోనూ అక్రమ లావాదేవీలు జరుగుతున్నట్లు అభిప్రాయపడ్డారు.వెరసి రిస్కులు అధికంగాగల విభాగంలో ఇన్వెస్టర్లు మరింత జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉన్నట్లు సూచించారు. ఇక్కడ నిర్వహించిన ఒక సదస్సు సందర్భంగా మహిళా పాత్రికేయులతో ముచ్చటించిన పురి పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధాన విభాగంతో పోలిస్తే ఎస్‌ఎంఈ విభాగం ప్రత్యేకమైనదని ఇన్వెస్టర్లు అర్థం చేసుకోవలసి ఉన్నట్లు పురి పేర్కొన్నారు. ప్రధాన విభాగంలోని కంపెనీలు తప్పనిసరిగా సమాచారాన్ని వెల్లడించవలసి ఉంటుందని, అయితే ఎస్‌ఎంఈ విభాగం రిస్కులు విభిన్నంగా ఉంటాయని ఇన్వెస్టర్లను హెచ్చరించారు. సెక్యూరిటీల టీం0 సెటిల్‌మెంట్‌ను మార్చి 28 నుంచి ఆప్షనల్ పద్ధతిలో ప్రవేశపెట్టనున్నట్లు పురి తెలియజేశారు. గత కొద్ది నెలల్లో భారీగా దూసుకెళుతున్న స్మాల్, మిడ్ క్యాప్ విభాగం షేర్ల విలువలపై స్పందిస్తూ కొన్ని కౌంటర్లలో అసహజ లావాదేవీలు నమోదవుతున్న సంకేతాలున్నట్లు వెల్లడించారు. ధరలను మ్యానిప్యులేట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవి బుడగలవంటివని వ్యాఖ్యానించారు. ఇలాంటి బుడగలు తలెత్తేందుకు అనుమతించకూడదని, ఇవి పగిలిపోతే ఇన్వెస్టర్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని స్పష్టం చేశారు. ఇది మార్కెట్లకు మంచిదికాదని అభిప్రాయపడ్డారు.

# భావి విద్యాపరమైన సహకారాలపై మెలిండా పావెక్ చర్చ




**కోల్‌కత :** కోల్‌కతాలోని కాన్సులేట్ జనరల్‌లోని కాన్సుల్ జనరల్ శ్రీమతి మెలిండా పావెక్ ఇటీవల షిల్లాంగ్‌ను సందర్శించి భావి విద్యాపరమైన సహకారాలపై చర్చించారు. దౌత్య మరియు కార్పొరేట్ రంగాలలో ఆమె విభిన్న నేపథ్యాన్ని గీయడం ద్వారా, కాన్సుల్ జనరల్ పావెక్ టోక్యోలోని యుఎస్ ఎంబసీలో సైన్స్, ఇన్నోవేషన్ మరియు డెవలప్‌మెంట్ కోసం కౌన్సెలర్ మరియు బందర్ సెరీలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ వంటి కీలక పాత్రలను హైలైట్ చేస్తూ, ఆమె ప్రస్తుత స్థానం యొక్క ప్రయాణాన్ని పంచుకున్నారు. బెగావాన్, బ్రూనై. ఫారిన్ సర్వీస్ ఆఫీసర్‌గా పబ్లిక్ సర్వీస్ నుండి జాన్సన్ జాన్సన్‌లో కార్పొరేట్ పాత్రల వరకు ఆమె విస్తృతమైన అనుభవం అంతర్జాతీయ సంబంధాల చిక్కులపై విలువైన అంతర్దృష్టులను అందించింది. షిల్లాంగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ గోయల్, కాన్సుల్ జనరల్ పావెక్‌ను స్వాగతిస్తూ షిల్లాంగ్ యొక్క వివిధ కార్యక్రమాల గురించి ప్రస్తావించారు మరియు షిల్లాంగ్ మరియు పాఠశాలల మధ్య పరస్పర మార్పిడి కార్యక్రమాలు, జాయింట్ రీసెర్చ్ కార్యక్రమాలు మరియు ఫ్యాకల్టీ సహకారాల ఫలితంగా స్కూల్స్‌తో అంతర్జాతీయ సహకారాన్ని హైలైట్ చేశారు. మాకు. సెషన్‌లో చర్చించబడిన ఒక ముఖ్యమైన చొరవ 100 మిలియన్ల అభ్యాసకులకు అభ్యాసాన్ని పెంపొందించడానికి అరిజోనా విశ్వవిద్యాలయం యొక్క ప్రయత్నం. ప్రాంతీయ విద్యా సహకారాన్ని పెంపొందించడం మరియు 21వ శతాబ్దపు గ్లోబల్ వర్క్‌ఫోర్స్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడం మరియు ఈ చొరవతో షిల్లాంగ్ సహకారం మరింతగా అన్‌లాక్ చేయడంలో కీలకం కాగలదనే లక్ష్యంతో “100,000 స్ట్రాంగ్ ఇన్ ది అమెరికాస్” వంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను కాన్సుల్ జనరల్ పావెక్ హైలైట్ చేశారు. విద్యా సహకారం. అంతేకాకుండా, కాన్సుల్ జనరల్ పావెక్ రెండు దేశాల స్థానిక జనాభా మధ్య పరస్పర అభ్యాసానికి గల సామర్థ్యాన్ని హైలైట్ చేశారు, ఒకరి సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకోవడం మరియు నేర్చుకోవడం ద్వైపాక్షిక వాణిజ్యంలో వృద్ధి మరియు శ్రేయస్సును పెంచుతుందని నొక్కి చెప్పారు. ఇన్‌స్టిట్యూట్‌లోని విద్యార్థులు మరియు అధ్యాపకులు ఉత్సాహంగా నిమగ్నమై, విద్యారంగంలో సాంస్కృతిక వ్యత్యాసాల గురించి ఉత్సుకతను వ్యక్తం చేశారు మరియు ఆధారిత పరిశోధన గ్రాంట్లు మరియు విద్వాంసులకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆసక్తిని కనబరుస్తున్నారు.

# విద్యుత్ వాహనాలతో వాతావరణ కాలుష్యం..!




**న్యూఢిల్లీ :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచవ్యాపంగా ఎన్నో విధానాలను అనుసరిస్తున్నారు. ప్రధానంగా వాతావరణ కాలుష్యం నిత్యం వినియోగిస్తున్న వాహనాల నుంచి వెలువడే పొగద్వారే ఏర్పడుతుంది.దాంతో వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రత్యామ్నాయంగా భావిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఈవీలు అందుబాటులోకి వచ్చాయి. భారత్‌లో కూడా ప్రముఖ కార్ల తయారీ సంస్థలు ఎలక్ట్రిక్ కార్లు, ఆటోలను విక్రయిస్తున్నాయి. అయితే, పెట్రోల్, డీజిల్ కార్ల కంటే ఈవీలు కాస్త అధిక కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్నాయని కొన్ని సంస్థలు చెబుతున్నాయి. ఎమిషన్ అనలటిక్స్ అనే సంస్థ రెండు రకాల కార్లలోని బ్రేకింగ్, టైర్ల నుంచి విడుదలయ్యే రేణువులపై అధ్యయనం చేసి ఆసక్తికర విషయాలను తెలిపింది. సాధారణ కార్ల ఇంజిన్ కంటే ఈవీల్లోని బ్యాటరీలు ఎక్కువ బరువుగా ఉంటాయి. దీంతో బ్రేక్ వేసినప్పుడు టైర్లపై అధిక ఒత్తిడి ఏర్పడి హానికారక రసాయనాలను గాలిలోకి విడుదల చేస్తున్నాయని తెలిపింది. ఇది పెట్రోల్, డీజిల్ కార్లలో విడుదలయ్యే వాటి కంటే అధికమని వెల్లడించింది. సింథటిక్ రబ్బర్, ముడి చమురుతో టైర్లను తయారు చేస్తుండటం ఇందుకు ప్రధాన కారణమని నివేదికలో పేర్కొంది. పర్యావరణ హితం కోసం చాలా దేశాల్లో ఈవీలకు ప్రత్యేక ప్రోత్సహకాలు అందిస్తున్నారు. క్రమంగా వీటి వినియోగం పెరుగుతోంది.

## సిఎం రేవంత్ రెడ్డిపై రాణిరుద్రమ

# సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: గత అసెంబ్లీ ఎన్నికల ముందు నేను రైతు బిడ్డను, కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని సిఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలికారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ విమర్శించారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఆరు గ్యారెంటీలలో ఒక గ్యారెంటీని రైతు భరోసా పేరుతో విడుదల చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలోని రైతులకు భరోసా లేదు రైతులను అదోగతి పాలు చేసి, రైతుల జీవితాలను దుర్భరమైన పరిస్థితుల్లోకి నెట్టేశారని మండిపడ్డారు.

గత వారం రోజులుగా రాష్ట్రంలో రైతులు పంటలకు నీళ్లు లేక, పొట్టదశకు వచ్చిన పంటల గింజలు తాలు అయ్యే పరిస్థితి వచ్చిందని, కొన్ని ప్రాంతాల్లో పొట్టకు రాకముందే పొలాలు ఎండిపోయి పశువులు మేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం 50లక్షల ఎకరాల్లో వరి సాగైందని సగం పంటలకు నీటి సరఫరా కావడంలేదని రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడుస్తున్నా కూడా రైతు భరోసా పథకం కింద రూ.15వేలు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు.

రైతు కూలీలకు రూ.12వేలు లేవు, కౌలు రైతులకు రూ.15వేలు జాడ లేదు, పత్తా లేవని, ఇప్పటివరకు కూడా రైతు కూలీలను గుర్తించలేదు వాళ్లను గుర్తించడానికి కమిటీ కూడా వేయలేదన్నారు.రైతు భరోసా పథకం ఎన్ని ఎకరాల రైతులకు ఇస్తరో కూడా ఎలాంటి ప్రణాళిక లేదని ఇప్పటి వరకు కూడా ఎలాంటి కమిటీ వేయలేదన్నారు. రెండు, మూడు రోజుల్లో పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కొత్త జీవోలను విడుదల చేయడానికి వీలు లేదన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500బోనస్ ఇస్తామని రైతు భరోసా గ్యారెంటీ కింద చెప్పారు కనీసం ఇప్పటివరకు కూడా జీవో విడుదల చేయలేదని మండిపడ్డారు. నిజంగా రైతులకు బోనస్ ఇవ్వాలని ఉంటే వెంటనే జీవో విడుదల చేయాలని, జీవో విడుదల చేయడానికి సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులకు సమయం దొరుకుతలేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపీటలు, చిన్నపీటలు వేసుకునే పంచాయతీ తప్ప రైతుల పంచాయతీని పట్టించుకోవడం లేదన్నారు. వారం రోజులుగా పంటలు ఎండిపోయి రైతులు అరణ్య గోస పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

## హైదరాబాద్ విమోచన దినోత్సవంపై కేంద్రం కీలక నిర్ణయం

హైదరాబాద్ విమోచన దినోత్సవంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబరు 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హెూంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. “1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తర్వాత వరకు హైదరాబాద్ ప్రాంతం నిజాం పాలనలో ఉంది. ఆపరేషన్ పోలో పేరుతో నిర్వహించిన పోలీసు చర్యతో 1948 సెప్టెంబరు 17న ఈ ప్రాంతం నిజాం పాలన నుంచి విముక్తి పొందింది. సెప్టెంబరు 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. హైదరాబాద్ విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన వారికి గుర్తుగా, నేటి యువతలో దేశభక్తి నింపడానికి భారత ప్రభుత్వం ఏటా సెప్టెంబరు 17ను హైదరాబాద్ విమోచన(లిబరేషన్) దినోత్సవంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది” అని నోటిఫికేషన్‌లో కేంద్ర హెూంశాఖ పేర్కొంది. దీనిపై హెూంమంత్రి అమిత్ షా ట్వీటర్ ద్వారా స్పందిస్తూ.. హైదరాబాద్ విమోచన ఉద్యమంలో అమరవీరుల స్మారకార్థం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీని హైదరాబాద్ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని ప్రధాని నిర్ణయించారని.. ఇది చారిత్రాత్మకమైన రోజు అని హెూంమంత్రి అమిత్



షా అన్నారు. హైదరాబాద్ ప్రాంతాన్ని దారుణమైన నిజాం పాలన నుంచి విముక్తి చేసి భారతదేశంలో విలీనం చేసేందుకు అత్యున్నత త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులకు, అమరవీరులకు ఈ నిర్ణయం సముచిత నివాళి అన్నారు. యువతలో దేశభక్తి జ్వాల రగిలించి, స్వాతంత్ర్య ఉద్యమంలో మన చిహ్నాలను చిరస్థాయిగా నిలిపే మోదీ ఈ కీలక నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నానని చెప్పారు.

## ప్రయోగించిన క్షణాల్లోనే పేలిపోయిన జపాన్ తొలి ప్రైవేట్ రాకెట్



టోక్యో : జపాన్ చేపట్టిన తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం విఫలమైంది. పశ్చిమ జపాన్ లోని వకయమ ప్రిఫిక్చర్ లోని లాంచ్ ప్యాడ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం దాదాపు 60 అడుగుల పొడవైన కైరోస్ రాకెట్ చిన్న ప్రభుత్వం ప్రయోగ ఉపగ్రహాన్ని తీసుకొని నింగికి ఎగిరింది. కానీ కొన్ని క్షణాల్లోనే ఇది పేలుడుకు గురై గాల్లోనే అగ్ని గోళంలా మారిపోయింది. దీని శకలాలు చుట్టూ ఉన్న పర్వత పాదాలపై పడ్డాయి. దీంతో తక్షణమే అక్కడ ఉన్న నీటి స్ప్రింకర్లు పనిచేయడం మొదలు పెట్టాయి. మరోవైపు పేలుడు ఫలితంగా లాంచ్ ప్యాడ్ ఏరియా మొత్తం నల్లడి పొగ కమ్మేసింది. వాస్తవానికి ప్రయోగించిన 51 నిమిషాల్లోనే ఈ రాకెట్ ఉపగ్రహాన్ని కక్ష లోకి చేర్చాల్సి ఉంది. టోక్యోకు చెందిన స్పేస్ వన్ సంస్థ ఈ రాకెట్‌ను నిర్మించింది. ఈ ప్రయోగం విజయవంతమైతే ఆ దేశంలో శాటిలైట్‌ను కక్ష లోకి ప్రవేశ పెట్టిన తొలి ప్రైవేట్ సంస్థగా ఇది రికార్డు సృష్టించేది. ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న ఉపగ్రహ ప్రయోగ మార్కెట్లోకి అడుగు పెట్టాలని భావించిన జపాన్ తాజా వైఫల్యంతో కొంత నిరాశ చెందింది.

## ఎన్ఆర్‌సితో సిఎఎ అనుసంధానం

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సి)తో అనుసంధానించారని, కొత్త చట్టాన్ని తాను వ్యతిరేకించడానికి అదే కారణం అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) చీఫ్ మమతా బెనర్జీ బుధవారం చెప్పారు. అస్సాంలో వలె పశ్చిమ బెంగాల్‌లో నిర్బంధ శిబిరాల ఏర్పాటును తాను కోరడం లేదని మమత జల్పాయిగురిలో విలేకరులతో చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు సిఎఎ ‘రాజకీయ ఎత్తుగడ’ అని కూడా ఆమె వ్యాఖ్యానించారు. మమత అంతకు ముందు జల్పాయిగురిలో పాలనాయంత్రాంగం సమావేశంలో ప్రసంగిస్తూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పౌరసత్వం మంజూరు ప్రక్రియ ఇతర దేశాలలోని విధానానికి భిన్నం అని పేర్కొన్నారు. సిఎఎ పరిధిలో నుంచి ముస్లింలను మినహాయించడాన్ని మమత విమర్శించారు. దేశ జనాభాలో చీలికల సృష్టి ఆ చట్టం లక్ష్యం అని ఆమె ఆరోపించారు. ‘దేశ ప్రజలను విభజించడం లక్ష్యంగా సిఎఎ తెచ్చారు’ అని ఆమె అన్నారు. సిఎఎ దరఖాస్తు ప్రక్రియ, ప్రజల హక్కులపై దాని ప్రభావంపై మమత ఆందోళన వ్యక్తం చేస్తూ, పశ్చిమ బెంగాల్ ప్రజల హక్కుల పరిరక్షణకు తన ప్రభుత్వం నిబద్ధమై ఉందని స్పష్టం చేశారు. ‘మేము భూస్వాములం కాము. కానీ అప్రమత్తమైన పరిరక్షకులం.

## ఎలక్టోరల్ బాండ్ల కేసుపై అన్ని వివరాలు గడువులోగా వెల్లడిస్తాం: రాజీవ్ కుమార్



న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల కేసుపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ స్పందించారు. దీనికి సంబంధించిన అన్ని వివరాలు సుప్రీంకోర్టు గడువులోగా వెల్లడిస్తామని తెలిపారు. ఈ మేరకు మీడియాతో ఆయన అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూస్తామని చెప్పారు. జమ్ముకశ్మీర్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లు ‘ప్రజాస్వామ్య పండుగ’లో ఉత్సాహంగా పాల్గోవాలని అభ్యర్థిస్తున్నట్లు సీఈసీ అన్నారు. కాగా, ‘2024 ఫిబ్రవరి 15, మార్చి 11 నాటి ఆర్డర్‌లో ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, మార్చి 12న ఎలక్టోరల్ బాండ్ల డేటాను ఎన్నికల సంఘానికి ఎస్‌బీఐ అందించింది’ అని ఎన్నికల సంఘం మంగళవారం పోస్ట్ చేసింది. మరోవైపు 2019 నుంచి 2024 వరకు సుమారు 22,217 ఎలక్టోరల్ బాండ్లను జారీ చేసినట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఇందులో ఇప్పటికే 22,030 బాండ్లను రిడీమ్ చేసినట్లు వెల్లడించింది. కేంద్ర ఎన్నికల సంఘానికి బాండ్ల డేటాను సమర్పించినట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ సమాచారాన్ని పెన్‌డ్రైవ్‌లో ఈసీకి అందించినట్లు చెప్పింది. రెండు పీడీఎఫ్ ఫైళ్ల రూపంలో పాస్‌వర్డ్ ప్రొటెక్షన్‌తో కూడా ఇచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అయితే మార్చి 15 సాయంత్రం 5 గంటలలోగా ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు తాజాగా ఆదేశించింది.

## ముఖం కప్పుకుని రోగిగా నటిస్తూ.. ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఐఏఎస్ అధికారిణి



లక్నో: ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో రహస్యంగా తనిఖీ చేయాలని ఐఏఎస్ అధికారిణి నిర్ణయించింది. ముఖం కప్పుకుని రోగి మాదిరిగా ఆ ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి సిబ్బందికి షాక్ ఇచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఫిరోజాబాద్‌లోని ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు ఫిర్యాదులు అందాయి. ఉదయం పది గంటలు దాటినప్పటికీ డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు వచ్చాయి. కాగా, ఆ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయాలని జిల్లా డిప్యూటీ కలెక్టర్ కృతి రాజ్ నిర్ణయించింది. దీంతో తనను గుర్తించకుండా ముఖానికి ముసుగు వేసుకుంది. రోగి మాదిరిగా నటించి డాక్టర్ చెకప్‌కు వెళ్లింది. అయితే డాక్టర్ ప్రవర్తన సరిగా లేకపోవడాన్ని అధికారిణి కృతి గ్రహించింది. హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేయగా కొందరు గైర్హాజరైనట్లుగా గుర్తించింది. రిజిస్టర్‌లో కొందరి సంతకాలు ఉన్నా ఆ సిబ్బంది అక్కడ లేకపోవడం, సిబ్బంది సేవల తీరు సరిగా లేకపోవడంపై ఆమె ఆగ్రహించింది. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రిలోని మెడికల్ స్టోర్‌ను కూడా డిప్యూటీ కలెక్టర్ కృతి రాజ్ తనిఖీ చేసింది. స్టాక్‌లో సగానిపైగా గడువు ముగిసిన మందులు ఉన్నట్లు గుర్తించింది. అక్కడి అపరిశుభ్రత పట్ల కూడా ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితిపై నివేదిక పంపుతానని వెల్లడించింది. కాగా, ఐఏఎస్ అధికారిణి కృతి ముఖానికి ముసుగు వేసుకుని, సాధారణ రోగి మాదిరిగా ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.


## రూ.8400కోట్లతో ఢిల్లీలో మెట్రో విస్తరణ..

# కేంద్ర కేబినెట్ ఆమోదం..



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కొత్తగా రెండు కారిడార్లలో మెట్రో నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇందుకు రూ.8400కోట్లు ఖర్చవనున్నది. కేబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వివరించారు. తొలి కారిడార్ లజ్‌పత్‌నగర్ నుంచి సాకేత్ జీ బ్లాక్ మధ్య.. 8.4 కిలోమీటర్లు ఉంటుందన్నారు. రెండో కారిడార్ ఇంద్రలోక్ నుంచి ఇంద్రప్రస్థ మధ్య 12.4 కిలోమీటర్లు ఉంటుందన్నారు. రెండు కారిడార్లలో 2029 మార్చి నాటికి పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. లజ్‌పత్ నగర్–సాకేత్ మధ్య నిర్మించనున్న మెట్రో బ్లాక్ సిల్వర్, మెజెంటా, పింక్, వైలెట్ లైన్లను కలుపుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ మార్గంలో ఎనిమిది స్టేషన్లు ఉంటాయన్నారు. ఇంద్రలోక్–ఇంద్రప్రస్థ మధ్య నిర్మించనున్న 12.377 కిలోమీటర్ల కారిడార్ గ్రీన్‌లైన్ పొడిగించనున్నట్లు అనురాగ్ ఠాకూర్ వివరించారు. ఇక్కడి ఎరుపు, పసుపు, ఎయిర్‌పోర్ట్ లైన్, మెజెంటా, వైలెట్, బ్లూ లైన్‌లోకి మారే అవకాశం ఉంటుందని వివరించారు.

## తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పాక్.. జీతం తీసుకోరాదని అధ్యక్షుడు జర్దారీ నిర్ణయం..!



పొరుగు దేశం పాకిస్థాన్ గత కొన్ని రోజులుగా తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఓ త్యాగానికి సిద్ధపడ్డారు. ఈ పదవీ కాలంలో జీతం తీసుకోకూడదని నిర్ణయించారు. ఈ మేరకు ఆ దేశ అధ్యక్ష కార్యాలయం ఎక్స్ వేదికగా ప్రకటించింది. ‘దేశానికి సహాయం చేయడానికి అధ్యక్షుడు జర్దారీ తన పదవీ కాలంలో ఎలాంటి జీతం తీసుకోరు. ఆర్థిక నిర్వహణ, జాతీయ ఆదాయంపై తన జీతం భారం పడకూడదన్న ఉద్దేశంతోనే అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. తన వేతనాన్ని వదులుకున్నారు’ అని తెలిపింది. అదేవిధంగా పాక్ ఇంటీరియర్ మంత్రి మొహసిన్ నక్వీ కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారు. ఈ సారి పదవీకాలంలో జీతాన్ని తీసుకోకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇది సవాళ్లతో కూడిన సమయమని, వీలైనన్ని మార్గాల్లో దేశానికి అండగా ఉండి సేవ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే తన జీతాన్ని వదులుకుంటున్నట్లు వెల్లడించారు. పాకిస్థాన్ 14వ అధ్యక్షుడి గా పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ సహ చైర్మన్ అసిఫ్ అలీ జర్దారీ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. శనివారం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో జర్దారీ విజయం సాధించారు. పీపీపీ, పీఎంఎల్–ఎన్ మద్దతుతో పోటీ చేసిన ఆయన సున్నీ ఇత్తెహాద్ కౌన్సిల్ అభ్యర్థి మహమూద్ ఖాన్ అచక్‌జాయ్ (75)ను ఓడించారు. ఈ ఎన్నికల్లో జర్దారీకి 255 ఓట్లు, మహమూద్‌కు 119 ఓట్లు లభించాయి. దీంతో తదుపరి పాక్ అధ్యక్షుడిగా జర్దారీ బాధ్యతలు చేపట్టారు. ఇస్లామాబాద్ లోని అధ్యక్ష భవనంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన దేశాధ్యక్ష పదవిని చేపట్టారు.

## బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు ప్రచారం.. క్లారిటీ ఇచ్చిన కడియం శ్రీహరి



తాను బీఆర్ఎస్ పార్టీ వీడుతున్నట్లు వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి స్పందించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. తాను పార్టీ మారడం లేదని.. కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని కడియం శ్రీహరి వెల్లడించారు. బీఆర్ఎస్‌లో ఎవరూ పార్టీని వీడటం లేదని ఆయన తెలిపారు. పార్టీలో ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com